ANN తెలుగు
Follow: @ANNTELUGU
11-08-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 218 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సేవకు సత్కారం ప్రతిభకు గౌరవం

- డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు కు ఎఎన్ఎన్ పురస్కారం

**విజయవాడ, మహా :** మూడు దశాబ్దాలకు పైగా దేవాదాయ శాఖలో సేవలందిస్తూ... తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ... భక్తుల సేవ, ఆలయాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు కు ఎఎన్ఎన్ ప్రతిష్ఠాత్మక సేవా పురస్కారం లభించింది. ఎఎన్ఎన్ ప్రెస్టీజియస్ బెస్ట్ ఇన్ సర్వీస్ లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్ లభించింది. సాధారణ ఉద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి... అంచెలంచెలుగా ఎదుగుతూ డిప్యూటీ కమిషనర్ స్థాయికి చేరుకున్న ఆయన... పనిచేసిన ప్రతి చోట తనదైన శైలిలో బాధ్యతలు నిర్వర్తించారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా... అనంతరం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి **మిగతా 2వ పేజీలో**

టాప్ న్యూస్



### 'ముందు కాలుస్తాం తర్వాత మాట్లాడతాం

గౌరీహెగ్డేగా టబు పవర్ ఫుల్ డైలాగ్స్ 02



### 'మోడియా బింద్' కళ్లజోడుతో.. పార్లమెంట్‌కు రేణుకా చౌదరి

లోపల అంధ భక్తులు ఉన్నారంటూ సెటైర్లు 02



### కమ్యూనిస్టులు పిరికివాళ్ళు

- దేశంలో కమ్యూనిస్టులంతా అంతే
- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఫైర్

02



# కృష్ణా తీరంలో మహా వరుణ యాగం

- సీఎం దంపతుల చేతుల మీదుగా పూర్ణాహుతి
- 11 హోమగుండాలు.. 108 మంది రుత్వికులు
- యాగంలో మంత్రి ఉత్తమ్ దంపతులు.. హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు



**నాగార్జునసాగర్, మహా :** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవుళ్లను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ వద్ద కృష్ణానది ఒడ్డున నిర్వహించిన ఈ పవిత్ర వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో...వానలు పడాలని ప్రభుత్వం మహావరుణయాగం నిర్వహించింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల

**మిగతా 4వ పేజీలో**



### చెత్తంతా

# సిఎంసీలోనే...!

**సర్వే నంబర్లు 11/33, 11/34లలో 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమి గల్లంతు!**

- సిఎంసీలో ప్రజా పాలన అట్టర్ ఫ్లాప్...!
- దండుపాళ్యం ముఠాలతో దోస్తానం...!
- దొంగలకు సద్ది కడుతున్న ఉన్నతాధికారులెవరు..!
- వందల కోట్ల ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలేనా...!
- ప్రభుత్వ నిషేధిత భూముల్లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!
- చేతులెత్తేసిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం...!
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పత్రాలు చెత్తబుట్టలకే పరిమితమా...!
- పత్తా లేని స్పెషల్ టాస్క్‌ఫోర్స్...!
- అటువైపు కన్నెత్తి చూడని హైడ్రా...!
- జీహెచ్ఎంసీ చట్టం–1955లోని సెక్షన్ 461-(ఎ)కు తూట్లు పొడుస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం...!
- అవినీతి, అక్రమాలతో కంపు కొడుతున్న మున్సిపల్ శాఖ...!
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థలు...!

02

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా పాలన పడకేసిందన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వెల్లువెత్తుతున్నాయి . దండుపాళ్యం ముఠాలతో చేతులు కలిపిన కొందరు ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో ప్రజా పాలన అట్టర్ ఫ్లాప్ అయిందనే ఆరోపణలు స్థానికంగా బహిరంగ చర్చకు దారి తీస్తున్నాయి.దొంగలకు సద్ది కడుతున్న అధికారుల తీరుతో వందల కోట్ల విలువైన ప్రభుత్వ నిషేధిత జాబితాల్లో ఉన్న భూముల్లో యథేచ్ఛగా బహుళ అంతస్థుల నిర్మాణాలు జరగడమే దీనికి నిదర్శనంగా చెప్పవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగంతో పాటు, పదుల సంఖ్యలో ప్రజావాణిలో చేసిన ఫిర్యాదులు, సమర్పించిన పత్రాలు చెత్తబుట్టలకే పరిమితమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పత్తా లేకుండా పోయిందని, హైడ్రా సైతం అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 461(ఎ)కు టౌన్ ప్లానింగ్ విభాగమే తూట్లు పొడుస్తూ సొమ్ము చేసుకుంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ కార్పొరేషన్ లో అంతులేని అవినీతి, అక్రమాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాల్సిన నిఘా వ్యవస్థలు నిద్రపోతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



## ఇళ్ల పట్టాల పంపిణీ

### మంత్రి పొంగులేటి, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం

**వరంగల్, మహా** : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే పథకాలు ఆలస్యమవుతున్నాయని పొంగులేటి వ్యాఖ్యానించగా.. కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని పొంగులేటి అనడంతో కౌశిక్‌రెడ్డి మరోసారి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. దీంతో కాసేపు సభా ప్రాంగణం రసాభాసగా మారింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

## దేశమంతా వానలే

- దక్షిణాది సహా పలు రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక
- కేరళ, కర్నాటకలో తీవ్ర వర్షా లు కురిసే ఛాన్స్

04



## తెలంగాణలో ముగిసిన ఎస్ఐఆర్ ప్రక్రియ

- తెలంగాణలో ముగిసిన ఎస్ఐఆర్ ప్రక్రియ.
- 3.38 కోట్లకు తేలిన ఓటర్లు.
- 73.95 లక్షల ఓట్ల తొలగింపు.

04

## గోవింద నామాలతో వైకాపా పేరడీ

**పవన్ ఆగ్రహం**

**అమరావతి, మహా :** తిరుమల శ్రీవారిని భక్తితో కొలుస్తూ ఆలపించే పవిత్ర దైవ నామాలు, భక్తి గీతాలను వైకాపా నేతలు పేరడీలుగా పాడారని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. నెల్లూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైకాపా నేతలు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ 'ఎక్స్'లో వెల్లడించింది. దీనిపై చట్టప్రకారం ముందుకెళ్లాలని పార్టీ నేతలకు పవన్ దిశానిర్దేశం చేసినట్లు పేర్కొంది. "ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ.. రాజకీయాల కోసం పవిత్ర గోవింద నామాలను పేరడీగా చేస్తూ భక్తుల మనోభావాలను కించపరిచింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారు వ్యవహరించిన తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉంది. మత విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతో చేసిన ఈ చర్యలపై పార్టీ నేతలు చట్ట



ప్రకారం ముందుకెళ్లాలి. ధార్మిక విశ్వాసంలో భాగమైన దైవ నామాలు, కీర్తనలను అపహాస్యం కోసం వాడే విధానాన్ని అందరూ విడిచిపెట్టాలి" అని పవన్ సూచించారు.




## బరితెగించిన అక్రమం..!

**జోడిమెట్లలో నాలాను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు...!**

**నాడెం నాలాపై యథేచ్ఛగా కొనసాగుతున్న కమర్షియల్ నిర్మాణాలు...!**

- నాలా ఆక్రమణలతో నీట మునుగుతున్న కాలనీలు...!
- చిరు జల్లులకే చెరువులుగా మారుతున్న రోడ్లు...!
- అటువైపు కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- పత్తా లేని ఇరిగేషన్ అధికారులు...!
- ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం...!
- మళ్లీ మొదలైన నిర్మాణ పనులు...!
- బుల్డోజర్లు ఎక్కడ...? హైడ్రా చర్యలేవి...?
- చర్యలు తీసుకుంటాం: ఇరిగేషన్ డిఈఈ ఆంజనేయులు.

02



# సేవకు గుర్తింపు విజయానికి గౌరవం

**ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ .. ప్రాణదాతలకు.. బిజినెస్ లీడర్లకు పురస్కారం**

ప్రాణాలను కాపాడే దైవం డాక్టర్లు, బిజినెస్ లీడర్స్... సమాజానికి ఉపాధి ఇచ్చే సృష్టికర్తలు. ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపే శక్తి, ఈ రెండు రంగాలు కలిసి ఉన్నప్పుడే.. ఒక దేశం నిజమైన అభివృద్ధి దిశగా సాగుతుంది. ఏఎన్ఎన్ ఒక న్యూస్ నెట్ వర్క్ మాత్రమే కాదు... ఒక బాధ్యత... ఒక వేదిక. అందుకే తెరవెనుక ఉన్న నిజమైన హీరోలను సత్కరించాలని నిర్ణయించింది. సేవచేస్తూ గుర్తింపు కోరుకోని వారికి ఏఎన్ఎన్ అవార్డ్స్‌తో పట్టాభిషేకం చేసింది. ఎఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026 ఆంధ్ర ప్రదేశ్ వేడుకకు విజయవాడలోని తాజ్ వివంటా హోటల్ వేదికగా నిలిచింది. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి స్టేట్ ప్రోగ్రామ్స్ అండ్ ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మన్యూస్ నెట్ వర్క్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ సీఈవో, మహా పత్రిక ఎండి కంది రామచంద్రారెడ్డి, న్యూస్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి, ఏపీ ఇన్ ఛార్జి కిషోర్ రెడ్డి, మహా పత్రిక నెట్ వర్క్ ఇన్ ఛార్జి కొత్తా శ్రీనివాసరావు, అసోసియేట్ ఎడిటర్ గడల నరసింహారావు తదితరులు వేడుకలో పాల్గొన్నారు. అవార్డుల వేడుక కన్నులపండుగగా జరగ్గా, స్ఫూర్తిదాయక విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

**- మహా, విజయవాడ**




# వాసిరెడ్డి రమ్యకృష్ణచౌదరికి ప్రతిష్టాత్మక పురస్కారం

- **బెస్ట్ హెయిర్ అండ్ స్కిన్ కన్సల్టెంట్ అవార్డ్**
- **ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అందజేత**

**విజయవాడ, మహా :** హెయిర్ అండ్ స్కిన్ కన్సల్టెంట్ విభాగంలో బెస్ట్ డాక్టర్ గా వాసిరెడ్డి రమ్య కృష్ణచౌదరికి ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. విజయవాడ కు చెందిన రమ్యకృష్ణ ఈ విభాగంలో అత్యుత్తమ సేవలు అందిస్తోంది. ముఖ్యఅతిథులు ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి స్టేట్ ప్రొటోకాల్ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చేతులమీదుగా ఆహుతుల కరతాళధ్వనుల మధ్య ఈ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. సేవకు సత్కారం.. ప్రతిభకు గుర్తింపు దక్కడం అభినందనీయమన్నారు. ఎఎన్ఎన్ హెల్త్ కేర్ అండ్ బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.




# ఏపీ బెస్ట్ హాస్పిటల్ గా మణిపాల్ హాస్పిటల్స్

- **ఆర్థోపెడిక్ సర్వీసెస్ లో అసమాన సేవలు**
- **ఎఎన్ఎన్ మహా పురస్కారం అందుకున్న మణిపాల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి**

**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సకల వసతులతో అత్యాధునిక సేవలు అందిస్తూ రోగుల మన్ననలు అందుకుంటున్న మణిపాల్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్వీసెస్ విభాగంలో లో ఏపీలో బెస్ట్ హాస్పిటల్ పురస్కారానికి ఎంపికైంది. ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన అవార్డును అతిరథుల సమక్షంలో.. ఆహుతుల కరతాళ ధ్వనుల మధ్య మణిపాల్ హాస్పిటల్స్ డైరెక్టర్ జె.రామాంజనేయరెడ్డి అవార్డును అందుకున్నారు. సేవకు గుర్తింపు.. ప్రతిభకు గౌరవాన్ని అందించేందుకు ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ విజయవాడ చరిత్రలో తొలిసారి తాజ్ వివంటాలో హెల్త్ కేర్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించింది. ప్రాణాలను కాపాడే దైవం డాక్టర్లకు అవార్డులు ఇవ్వడం గొప్ప అవకాశంగా ఎఎన్ఎన్ యాజమాన్యం ప్రకటించింది. అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వం తరుపున ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి స్టేట్ ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం, ఎఎన్ఎన్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, అసోసియేట్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి, ఏపీ ఇన్ ఛార్జి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్స్ డైరెక్టర్ జె.రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని, తగిన వ్యాయామం చేయాలని, ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలని కోరారు.




# సౌరశక్తిరంగంలో అగ్రగామి జీటీఆర్ సోలార్ పవర్

- **సాంబశివరావుకు ప్రతిష్టాత్మక అవార్డు**

**విజయవాడ, మహా :** స్ఫూర్తిదాయ ప్రయాణానికి ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ సమున్నత రీతిలో సత్కరించింది. జీటీఆర్ సోలార్ పవర్ స్థాపించి ఆంధ్ర ప్రదేశ్ లో ముందుచూపున్న సారథిగా పదిహేనేళ్ళ క్రితమే ముందడుగు వేసి ఇపుడు అత్యధిక ప్రాజెక్ట్‌లతో ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్న జీ.సాంబశివరావుకు ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మక బిజినెస్ లీడర్ అవార్డ్ అందించింది. సోలార్ పవర్ ప్రాముఖ్యతను దశాబ్దంన్నర క్రితమే గుర్తించి ముందడుగు వేసిన మార్గదర్శికి ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ తాజ్ వివంటాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన హెల్త్ కేర్ అండ్ బిజినెస్ అవార్డ్స్ కార్యక్రమంలో సత్కరించింది. ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చేతులమీదుగా అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఛైర్మన్ కంది శ్రీనివాస రెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ప్రముఖులు, ఆహుతుల హర్షధ్వనాల మధ్య ఈ అవార్డును జీ.సాంబశివరావు అందుకున్నారు. సోలారం రంగంలో ఆయప ముందడుగు ఎందరికో ఆదర్శమైంది. జీటీఆర్ ను అగ్రగామిగా నిలిపింది.




# రామరాజు లక్ష్మిశ్రీనివాస్ కు ప్రతిష్టాత్మక అవార్డు

- **ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అందజేత**

**విజయవాడ, మహా :** వీణావిద్వాంసురాలు రామరాజు లక్ష్మిశ్రీనివాస్ కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లోని వివిధరంగాల్లోని నిష్ణాతులకు అందజేస్తున్న అవార్డుల కార్యక్రమంలో లక్ష్మిశ్రీనివాస్ వీణ ప్రదర్శనకు ఆహుతులు అభినందనల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎన్ సరస్వతి సంగీత పురస్కారాన్ని ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి స్టేట్ ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం, అన్నవరం దేవస్థానం ఈవో, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు, కాలభైరవ సిద్ధాంత గురూజీ, ఎఎన్ఎన్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డిల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. హెల్త్ కేర్, బిజినెస్ తో పాటు కళారంగం వారికి అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు.




# బెస్ట్ మెడికల్ స్టార్టప్ గా మెడ్ మీల్ ఎఎన్ఎన్ మహా పురస్కారం

- **ప్రత్యేక పోషకాలు కలిగిన ఆహారం అందించడంలో దిట్ట**

**విజయవాడ, మహా :** ప్రత్యేక పోషకాలు కలిగిన ఆహారం అందించడంలో ప్రత్యేకంగా నిలుస్తున్న మెడికల్ స్టార్టప్ మెడ్ మీల్ కు ఎఎన్ఎన్ మహా పురస్కారం దక్కింది. మెడ్ మీల్ ఫౌండర్,న్యూరో సర్జన్ అమీన్ తరుపున తమీమ్ అన్సారీ మార్కెటింగ్ సేల్స్ సీనియర్ మేనేజర్ ఎఎన్ఎన్ బెస్ట్ మెడికల్ స్టార్టప్ అవార్డు అందుకున్నారు. ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఈ అవార్డు అందించడం ప్రోత్సాహకరంగా ఉందని, మెడ్ మీల్ కు దక్కిన అవార్డు మరిన్ని నూతన ఆవిష్కరణలకు నాందిగా నిలుస్తుందని యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. మెడ్ మీల్ వినూత్నవిధానాలను గుర్తించి సెలక్షన్ కమిటీ అవార్డుకు ఎంపికచేసిందని కార్యక్రమంలో పాల్గొన్న ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఛైర్మన్ కంది శ్రీనివాస రెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి అన్నారు. ముఖ్యఅతిథులు ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి స్టేట్ ప్రొటోకాల్ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. సేవకు సత్కారం.. ప్రతిభకు గుర్తింపు దక్కడం అభినందనీయమన్నారు.




# వైద్య ఆవిష్కరణల్లో సరికొత్త విప్లవం

- **డాక్టర్ రోహిత్ తౌటంకు ప్రతిష్టాత్మక పురస్కారం**

**విజయవాడ, మహా :** వినూత్న ఆవిష్కరణలతో తెలుగురాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న గ్యాన్ ఇన్ ఫో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెల్త్ కేర్ అండ్ ఇన్నోవేషన్ అవార్డ్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ ను సంస్థ అధినేత రోహిత్ తౌటం అందుకున్నారు. విజయవాడ తాజ్ వివంటాలో వైభవంగా జరిగిన హెల్త్ కేర్ అండ్ బిజినెస్ అవార్డ్స్ ఆంధ్రప్రదేశ్ ఎడిషన్ అవార్డుల కార్యక్రమంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ప్రముఖులు, ఆహుతుల హర్షధ్వనాల మధ్య ఈ అవార్డును రోహిత్ అందుకున్నారు.




# చిరంజీవ నర్సింగ్ హోంకు ప్రతిష్టాత్మక పురస్కారం

- **కోనసీమలో బెస్ట్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి అవార్డ్**
- **ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అందజేత**

**విజయవాడ, మహా :** కోనసీమ ప్రాంతంలో బెస్ట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ గా, ఎమర్జెన్సీ హాస్పిటల్ గా చిరంజీవ నర్సింగ్ హోంకు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ విజయవాడ తాజ్ వివంటా హోటల్ లో అంగరంగవైభవంగా నిర్వహించిన వేడుకలో చిరంజీవ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ బీఆర్ క్రిష్ణప్రసాద్ కు అవార్డు దక్కింది. వైద్యరంగంలో విశేష సేవలందించడంతో పాటు కోనసీమ ప్రాంతంలో ఎమర్జెన్సీ వైద్యానికి కేరాఫ్ గా నిలుస్తున్న చిరంజీవకు ప్రభుత్వ కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బిజెపి ప్రొటోకాల్ ఛైర్మన్ పాతూరి నాగభూషణం చేతులమీదుగా అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.







# కృష్ణా తీరంలో మహా వరుణ యాగం

( మొదటి పేజీ తరువాయి )

ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలతో వరుణదేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని తెలిపారు.

**వానలు పడాలి, పంటలు పండాలి : ముఖ్యమంత్రి ప్రార్థన**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ లతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలని రాష్ట్రంలోని ప్రతి చెరువు, కుంట జలకళతో కళకళలాడి భూగర్భ జలాలు పెరిగి.. పంటలు పుష్కలంగా పండాలని వేడుకున్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా, రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు.

**నాగార్జున సాగర్ కు మంత్రులు, ఎమ్మెల్యేలు :**

దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ వద్ద కృష్ణానది ఒడ్డున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా వరుణ యాగం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన 108 మంది ఋత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున 4.05 గంటలకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమైంది. అనంతరం గోపూజ, యాగ ప్రదక్షిణ, పుణ్యాహవచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో చేసిన ఈ పవిత్ర వరుణయాగం కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.









# ఆగస్టులో కార్లపై భారీ ఆఫర్లు

**రూ.3లక్షల దాకా తగ్గింపులు**

**ఈ కార్లపై భారీ డిస్కౌంట్లు**

**హైదరాబాద్, మహా :** ఆగస్టు నెలలో కొత్త కారు కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే ఇదే సరైన సమయం కావచ్చు. కొత్త కారు కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు ఎంపిక చేసిన మోడళ్లపై ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. క్యాష్ డిస్కౌంట్ తో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బెనిఫిట్, లాయల్టీ బోనస్ వంటి పలు ప్రయోజనాలను అందిస్తున్నాయి. ముఖ్యంగా టాటా మోటార్స్, కియా, హ్యుందాయ్, హోండా కార్లపై ఈ ఆగస్టులో అందుబాటులో ఉన్న ఆఫర్లు కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా ఉన్నాయి.

అయితే ఈ ప్రయోజనాలు మోడల్, వేరియంట్, డీలర్, నగరం, స్టాక్, ఎక్స్ఛేంజ్ లేదా స్క్రాపేజ్ అర్హతలను బట్టి మారే అవకాశం ఉంది.

టాటా మోటార్స్

టాటా కర్వ్ - గరిష్ఠంగా రూ.1.25 లక్షల వరకు ప్రయోజనాలు. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.3.50 లక్షల వరకు తగ్గింపులు లభించే అవకాశం ఉంది.

టాటా నెక్సాన్ - వేరియంట్‌ను బట్టి రూ.90 వేల వరకు ప్రయోజనాలు.

టాటా ఆల్ట్రోజ్ - గరిష్ఠంగా రూ.55 వేల వరకు ప్రయోజనాలు.

టాటా టియాగో - ఎంపిక చేసిన వేరియంట్లపై రూ.35 వేల వరకు ప్రయోజనాలు. టియాగో ఎలక్ట్రిక్ వేరియంట్ పై గరిష్ఠంగా రూ.1.45 లక్షల వరకు ఆఫర్ ఉంది.

టాటా హ్యారియర్ - డీజిల్ వేరియంట్లపై రూ.45 వేల వరకు, ఎలక్ట్రిక్ వేరియంట్ పై రూ.1.75 లక్షల వరకు ప్రయోజనాలు.

టాటా సఫారీ - డీజిల్ మోడళ్లపై రూ.45 వేల వరకు ప్రయోజనాలు.

టాటా సియెరా డీజిల్ - రూ.30 వేల వరకు ప్రయోజనం.

కియా కార్స్.. ఆగస్టు ఆఫర్లు

కియా సెల్టోస్ - గరిష్ఠంగా రూ.40 వేల వరకు ప్రయోజనాలు.

కియా సోనెట్ - గరిష్ఠంగా రూ.55 వేల వరకు ప్రయోజనాలు.

కియా సైరోస్ - గరిష్ఠంగా రూ.65 వేల వరకు ప్రయోజనాలు.

కియా క్యారెన్స్ - గరిష్ఠంగా రూ.95 వేల వరకు ప్రయోజనాలు.

హ్యుందాయ్ కార్లు.. ఆకర్షణీయమైన డీల్స్

హ్యుందాయ్ క్రెటా - గరిష్ఠంగా రూ.1 లక్ష వరకు ప్రయోజనాలు.

హ్యుందాయ్ వెర్నా - గరిష్ఠంగా రూ.85 వేల వరకు ప్రయోజనాలు.

హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ - రూ.70 వేల వరకు ఆకర్షణీయమైన తగ్గింపులు.

హ్యుందాయ్ ఎక్స్టర్ - రూ.65 వేల వరకు తగ్గింపులు.

హ్యుందాయ్ ఐ20 - రూ.60 వేల వరకు ప్రయోజనాలు.

హోండా కార్లు.. ఆగస్టు ఆఫర్లు

హోండా ఎలివేట్ - గరిష్ఠంగా రూ.1.55 లక్షల వరకు ప్రయోజనాలు.

హోండా సిటీ - గరిష్ఠంగా రూ.85 వేల వరకు ప్రయోజనాలు.

హోండా అమేజ్ - గరిష్ఠంగా రూ.40 వేల వరకు తగ్గింపులు.

డిస్కౌంట్ అంటే మొత్తం క్యాష్ కాదు!

ఇక్కడ పేర్కొన్న మొత్తాలు గరిష్ఠంగా లభించే ప్రయోజనాలు మాత్రమే. ప్రతి కస్టమర్‌కు ఇదే మొత్తంలో డిస్కౌంట్ లభిస్తుందని భావించకూడదు. ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ ప్రయోజనం, లాయల్టీ బోనస్, నిర్దిష్ట వేరియంట్, డీలర్ స్టాక్, ప్రాంతం వంటి అంశాల ఆధారంగా తుది ఆఫర్ మారవచ్చు. అందుకే కారు బుక్ చేసే ముందు క్యాష్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బెనిఫిట్, లాయల్టీ బోనస్, ఇన్సూరెన్స్, యాక్సెసరీస్ తదితర ప్రయోజనాలను విడివిడిగా పేర్కొంటూ డీలర్ నుంచి రాతపూర్వక కోటేషన్ తీసుకోవడం మంచిది. ఆగస్టులో కారు కొనాలనుకునేవారు.. ఆఫర్ చూసి వెంటనే బుక్ చేయకుండా, తుది ఆన్‌రోడ్ ధరను పోల్చి చూసిన తర్వాత నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.



# దేశమంతా వానలే

**మహా :** దేశంలో నైరుతి రుతుపవనాలు మరోసారి చురుకుదనం సంతరించుకోవడంతో పలు రాష్ట్రాల్లో వర్షాల తీవ్రత పెరగనుంది. రానున్న రోజుల్లో ఉత్తర, మధ్య, తూర్పు, ఈశాన్య, పశ్చిమ, దక్షిణ భారత ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజా అంచనాల్లో వెల్లడించింది. ముఖ్యంగా మధ్య భారతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం ఉండగా.. పశ్చిమ హిమాలయ ప్రాంతాల్లోనూ వర్షాల ఉద్ధృతి కొనసాగనుంది. కొండ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రమాదాలు ఉండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే కేరళ, కర్ణాటకలో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండనుంది. కేరళ, తీర కర్ణాటక, దక్షిణ అంతర్భాగ కర్ణాటక, లక్షద్వీప్ ప్రాంతాల్లో రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఆగస్టు 8న కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 12 నుంచి 20 సెంటీమీటర్ల మేర అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. కర్ణాటక తీర ప్రాంతంలోనూ భారీ వర్షాలు నమోదయ్యాయి. దీంతో పశ్చిమ కనుమల పరిధిలో వర్షాల తీవ్రతను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లోనూ వాతావరణం చురుగ్గా ఉండనుంది. తెలంగాణతో పాటు రాయలసీమ, కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా.. గాలుల వేగం అప్పుడప్పుడు 60 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించింది. కోస్తాంధ్ర, రాయలసీమలో ఈదురుగాలుల ప్రభావం ఆగస్టు 12 వరకు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో ఇప్పటికే వర్షాల ప్రభావం కనిపిస్తోంది. ఆగస్టు 8న ముగిసిన 24 గంటల వ్యవధిలో మెదక్ జిల్లా పాపన్నపేటలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో కేరళ, తీర కర్ణాటక, తమిళనాడు తదితర దక్షిణాది ప్రాంతాల్లోనూ గణనీయమైన వర్షపాతం నమోదైంది. దీంతో రానున్న రోజుల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో స్థానికంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. మధ్య భారతంలో మాత్రం వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఉత్తర మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం ప్రభావంతో మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఆగస్టు 10న ప్రత్యేక హెచ్చరిక జారీ చేసింది. పశ్చిమ మధ్యప్రదేశ్‌లో ఆగస్టు 910 తేదీల్లో భారీ వర్షాలకు, ఆగస్టు 1112 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. తూర్పు మధ్యప్రదేశ్‌లోనూ ఆగస్టు 10 వరకు భారీ వర్షాలు కొనసాగనున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఆగస్టు 10 నుంచి 14 వరకు భారీ వర్షాలకు అవకాశం ఉంది. మధ్య భారతంలో ఇప్పటికే కురిసిన భారీ వర్షాలు పలు ప్రాంతాల్లో జనజీవనాన్ని ప్రభావితం చేశాయి. ఆగస్టు 8న ముగిసిన 24 గంటల్లో పశ్చిమ మధ్యప్రదేశ్‌లో 12 నుంచి 20 సెంటీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. ఖానియాధాన్‌శివపురి ప్రాంతంలో 16 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఉత్తర భారతంలోనూ వర్షాల ముప్పు కొనసాగుతోంది. జమ్మూకశ్మీర్, లడఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆగస్టు 10 11 తేదీల్లో హిమాచల్‌ప్రదేశ్, తూర్పు రాజస్థాన్‌లో కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 910 తేదీల్లోనూ భారీ నుంచి అత్యంత భారీ వర్షాల ముప్పు ఉందని తెలిపింది. కొండ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సమయంలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ వర్షాల ప్రభావం కొనసాగుతోంది. ఆగస్టు 8న ముగిసిన 24 గంటల్లో దిల్లీలోని పుష్ప్ విహార్‌లో 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హర్యానాలోని మెహమ్‌లో 14 సెంటీమీటర్లు నమోదయ్యాయి. ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రహదారులపై నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో వర్షాల తీవ్రత కొనసాగనుందని ఐఎండీ తెలిపింది. తూర్పు భారతదేశంలోనూ రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. గంగా పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా, ఉప హిమాలయ పశ్చిమబెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో ఆగస్టు 8 నుంచి 14 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒడిశాలో ఆగస్టు 12 నుంచి 14 వరకు కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముంది. జార్ఖండ్‌లోనూ ఆగస్టు 10 వరకు భారీ వర్షాల ముప్పు కొనసాగనుంది. తూర్పు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఈశాన్య భారతంలో అసోం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపుర ప్రాంతాల్లోనూ వర్షాలు కొనసాగనున్నాయి. అసోం, మేఘాలయలో ఆగస్టు 1314 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు నమోదవుతున్న నేపథ్యంలో నదులు, వాగుల నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉంది. పశ్చిమ భారతంలో కొంకణ్, గోవా ప్రాంతాల్లో ఆగస్టు 8 నుంచి 14 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుజరాత్, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, సౌరాష్ట్రకచ్ ప్రాంతాల్లోనూ అక్కడక్కడ వర్షాలు పడనున్నాయి. గుజరాత్‌లో ఆగస్టు 810 తేదీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉండొచ్చని ఐఎండీ తెలిపింది. మొత్తంగా చూస్తే దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఒకేసారి అనేక ప్రాంతాల్లో వర్షాల ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లోని అల్పపీడన ప్రాంతం, హిమాలయ ప్రాంతాల్లో చురుకైన రుతుపవన పరిస్థితులు, తూర్పుఈశాన్య భారతంలో కొనసాగుతున్న వర్ష కార్యకలాపాలు దేశ వాతావరణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దక్షిణాదిలో కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలకు అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచిస్తోంది. ఆగస్టు 8న దేశంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు నమోదైన నేపథ్యంలో రాబోయే రోజుల్లో పరిస్థితులు మరింత చురుగ్గా మారే అవకాశం ఉంది. కేరళలో 17 సెంటీమీటర్లు, ఢిల్లీలో 17 సెంటీమీటర్లు, పశ్చిమ మధ్యప్రదేశ్‌లో 16 సెంటీమీటర్లు, తూర్పు రాజస్థాన్‌లో 16 సెంటీమీటర్లు, ఒడిశాలో 13 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. తెలంగాణలోని పాపన్నపేటలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో ప్రజలు స్థానిక అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండటం అత్యవసరం.

# తెలంగాణలో ముగిసిన ఎస్ఐఆర్ ప్రక్రియ

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గణన ప్రక్రియ పూర్తికాగా.. మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. గణన సందర్భంగా 73,95,954 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 గణన పత్రాలను డిజిటలీకరించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలీకరణ పూర్తయింది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే యాదాద్రి భువనగిరి జిల్లా డిజిటలీకరణలో అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ 94.30 శాతం గణన పత్రాల డిజిటలీకరణ పూర్తయింది. మెదక్ జిల్లాలో 90.54 శాతం, సూర్యాపేటలో 90.43 శాతం నమోదైంది. కుమురం భీమ్ ఆసిఫాబాద్‌లో 89.45 శాతం, జగిత్యాలలో 89.60 శాతం ప్రక్రియ పూర్తయింది.

**హైదరాబాద్‌లో మందగించిన ప్రక్రియ**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాత్రం డిజిటలీకరణ ప్రక్రియ మందకొడిగా సాగింది. జిల్లాలో 27,74,687 ఓట్లు ఉండగా.. కేవలం 58.58 శాతం గణన పత్రాలే డిజిటలీకరణ పూర్తయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో హైదరాబాద్ రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్ -మల్కాజిగిరిలో 63.82 శాతం, రంగారెడ్డిలో 64.91 శాతం నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాల్లో డిజిటలీకరణకు రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధిక జనాభా, భారీ సంఖ్యలో ఓటర్లు, పట్టణ ప్రాంతాల్లో గణన ప్రక్రియకు ఎదురైన ఇబ్బందులు ఇందుకు కారణాలుగా అధికారులు భావిస్తున్నారు.

**తొలగించిన ఓట్లపై అభ్యంతరాలకు అవకాశం**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించిన నేపథ్యంలో.. ముసాయిదా జాబితా విడుదల అనంతరం అభ్యంతరాలు, దావాలకు అవకాశం కల్పించనున్నారు. గణనలో తమ పేరు లేకపోవడం లేదా అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులు నిర్ణీత ప్రక్రియ ద్వారా అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు.రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈ నెల 12న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

**నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ**

ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాలు, దావాలను స్వీకరించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ సమయంలో ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా? లేక తొలగించారా? అన్నది పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం తుది జాబితాను రూపొందించనున్నారు.అన్నీ అనుకున్న ప్రకారం జరిగితే అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. దీంతో రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తికానుంది.రాష్ట్రవ్యాప్తంగా 73.95 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు తొలగించినట్లు వెలువడిన గణాంకాల నేపథ్యంలో.. ముసాయిదా జాబితా విడుదల తర్వాత జరిగే అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ అత్యంత కీలకంగా మారనుంది. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడటంతోపాటు.. అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ పారదర్శకంగా జరగాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది.

# సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**భువనగిరిలో 2 గంటల పాటు రాస్తారోకో**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 10 మహా :** కేంద్ర ప్రభుత్వ,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా జైల్ సోమవారం బరో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మిక , రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీ ర్యాలీ రైతు బజార్ వద్ద, రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు.

ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు లు. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కాలరాస్తూ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ,స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం వల్ల అమెరికా బ్రిటన్ ఇజ్రాయిల్ ,అనేక యురోపియన్ దేశాల ద్వారా 32 రకాల ఆహార ఉత్పత్తులు భారతదేశానికి దిగుమతి ఒప్పందంతో దేశీయ రైతులు పంటలకు గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని , వెంటనే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, విత్తన సవరణ చట్టాన్ని రద్దుచేసి రైతాంగాన్ని కాపాడాలని, విద్యుత్ సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని తెలిపారు విద్యుత్ సవరణ చట్టం ద్వారా రైతాంగానికి అందుతున్న ఉచిత విద్యుత్తుకు ఎగనామం పెట్టి కుట్ర చేస్తుందని, పేదలు ఉపయోగిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ,ఎగ్గొట్టే విధంగా వ్యవసాయ బావులకు స్మార్ట్ మీటర్లు పెట్టి రైతులపై భారం మోపే విధానాలని నిరసించాలని పిలుపునిచ్చారు రోజువారి పని ఎనిమిది గంటలనుండి 10 గంటలకు పెంచడం, కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని, రుణ విమోచన చట్టం తేవాలని, ఆహార భద్రతా చట్టంలో పేదలకు కోత విధింపు చర్యలను విరమించుకోవాలని కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధానాలను కార్మికులు కర్షకులు ఏకమై మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, జిఎంబిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ పాల్గొన్నారు



**యాదగిరిగుట్టలో**

కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ సంపదను బహుళజాతి కార్పొరేట్ యాజమాన్యాలకు దోచిపెడుతోందని , పరిపాలించే అధికారం ఏ మాత్రం లేదని వెంటనే గద్దె దిగాలనీ సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు కల్లూరి మల్లేశం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సి ఐ టి యు , రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా యాదగిరిగుట్ట అంబేద్కర్ విగ్రహం ముందు జైల్ బరో సందర్భంగా రాస్తారోకో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరి మల్లేశం మాట్లాడుతూ మోదీ పాలనలో సామాన్య ప్రజలపై, కార్మికులపై తీవ్రమైన భారాలు పడుతున్నాయని మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలో సైతం భారత కార్మిక వర్గం పోరాడి అనేక హక్కులను సాధించుకున్నదని వాటిలో 29 చట్టాలను రద్దు చేసి, కార్మికులకు నష్టం చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడమేనని ఆరోపించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్లను, వారికి కొమ్ము కాస్తున్న కేంద్ర మతోన్మాద బిజెపి ప్రభుత్వ విధానాలను దేశం నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్కే షరీఫ్, మాజీ సర్పంచ్ భీమగాని రాములు,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారు సత్యనారాయణ ,జిల్లా సహాయ కార్యదర్శి చెక్క రమేష్, సిఐటియు నాయకులు కాల్నే స్వామి, యూనియన్ నాయకులు సుగుణ మాలతి, బండ శ్రీశైలం, కంబాల స్వామి తదితరులు పాల్గొన్నారు...

**పోచంపల్లిలో...**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విబిజి గ్రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లు మరియు విత్తన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలని, కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం విధానాలపైన జైల్ బరో కార్యక్రమం సందర్భంగా పోచంపల్లి పట్టణంలో సిఐటియు , తెలంగాణ రైతు సంఘం , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల భువనగిరి చౌరస్తాలో " రాస్తారోకో " కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లెబర్ కోడ్లను కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, యూనియన్ పెట్టుకోవడానికి అవకాశం లేకుండా పోతుందని అన్నారు. ఉద్యోగులను తొలగించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, 8 గంటల పనిని 12 గంటల వరకు పెంచుకునేందుకు కంపెనీలకు ఈ కోడ్‌లు వెసులుబాటు కల్పిస్తున్నాయని తక్షణం రద్దు చేయాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన విబిజి గ్రామ్ జి చట్టం వల్ల గ్రామీణ వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని తెలిపారు. గత పథకంలో అన్‌స్కిల్డ్ కూలీల వేతనాల ఖర్చును 100% కేంద్ర ప్రభుత్వమే భరించేది. కానీ కొత్త చట్టంలో నిధుల కేటాయింపును 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిష్పత్తికి మార్చారని దీనివల్ల రాష్ట్రాల మీద అప్పుల భారం పడి ఉపాధిని బందు చేయాలని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కొత్త చట్టం ఉపాధి కల్పనలో భారీ తగ్గుదల ఉంటుందని అమలు చేసిన మొదటి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పన దేశవ్యాప్తంగా దాదాపు 50 శాతం తగ్గిందని విమర్శించారు. ఏడాదికి 60 రోజుల పాటు ఉపాధి పనులను నిలిపివేస సొంత భూమి లేని నిరుపేద కూలీలు, మహిళా కార్మికులకు వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో తీవ్ర జీవనోపాధి సంక్షోభం ఎదురవుతోందని ఇప్పటికైనా వివిజి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులందరికీ పూర్తి వ్యవసాయ రుణాల మాఫీ ప్రకటించాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను (ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును) ఆపాలని, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే ప్రతిపాదిత నూతన విత్తన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి , రైతు సంఘం మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి , సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు , పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి , తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష , కార్యదర్శులు పగిళ్ల లింగారెడ్డి , గూడూరు బుచ్చిరెడ్డి , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష , కార్యదర్శులు బొడ్డు కిషన్, ప్రసాదం విష్ణు పాల్గొని మాట్లాడగా మూడు సంఘాల బాధ్యులు అందెల జ్యోతి, గూడూరు రాంరెడ్డి, పత్తి బిక్షపతి, వారాల మల్లారెడ్డి, బాబు, ఉపేందర్, శంకర్, స్వామి, సలీం, లింగస్వామి, అరుణ, జయమ్మ, శారద, మనీలా, పద్మ, వసంత, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమాజ మార్పు కోరుకున్న నాయకుడు సూదగాని ఎట్టయ్య

**ఆలేరు ఆగస్టు 10 మహా**: చాలామంది తన కుటుంబం తన బంధువులు బాగుండాలని కోరుకుంటారు తప్ప రాష్ట్రంలోని ప్రజలందరికీ శ్రేయస్సు కోసం ఆలోచించరని కానీసూదగాని ఎట్టయ్య రాష్ట్రంలోని ప్రజలందరూ బాగుండాలని కోరుకున్న వ్యక్తి అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ అన్నారుఅమరుల యాదిలో గీతన ల చైతన్య యాత్ర ఎట్టయ్య స్వగ్రామం ఆలేరు మండలం శర్బనాపురం గ్రామానికి చేరుకున్న సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అంతకుముందుకు గ్రామంలో గీతా కార్మికులు, డప్పు, కోలాట కళాకారులు గీతల్లో చైతన్య యాత్ర బృందానికి స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు గ్రామపంచాయతీ వద్ద అమరుడు ఎట్టయ్యకు, అమరుల కు పూలమాలలు వేసి రాష్ట్ర నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం మండల అధ్యక్షులు దూపటి వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో రమణ మాట్లాడుతూ సమాజం కోసం సమాజం మార్పు కోసం పోరాడిన ఎట్టయ్య జీవితం మరుపురానిదని అన్నారు గీతా కార్మికుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో గీతా కార్మికులకు మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్లన్నింటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు ఆయన విగ్రహాన్ని ట్యాంకు బండపై ప్రభుత్వం పెట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించి తామే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. 50 సంవత్సరాలు దాటిన గీతా కార్మికులకు 4000 పెన్షన్, చనిపోయిన కార్మిక కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న 20 కోట్ల ఎక్స్ గ్రేషన్ డబ్బులు వెంటనే బాధితులకు ఇవ్వాలని, రాష్ట్రంలో ఉన్న కోటి తాటి ఈత చెట్లకు నంబర్లు వేసి చెట్లను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనం, సర్వేల్, నల్గొండ జిల్లా చారకొండ రంగారెడ్డి జిల్లా మునిపల్లి లలో నీర కలెక్షన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు వెంటనే ఏర్పాటు చేసి యువతి యువకులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆఫీస్ బేరియర్ లు గోవిందు జయరాములు గౌడ్ వెంకన్న వెంకట మల్లయ్య వెంకట నరసయ్య సాంబయ్య సీతారాములు బూడిద గోపి రమేష్ గౌడ్ వెంకట్ గౌడ్ అంజిబాబు శ్రీనివాస్ తో పాటు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆలేరు మండల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు సత్య రాజయ్య, ఎట్టయ్య కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ గ్రామ గీత కార్మిక నాయకులు పాల్గొన్నారు

# రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై రాస్తారోకో

- **మణుగూరు ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్..**
- **కేంద్రం తీరు మారకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం**
- **నాయకులు సుధాకర్, మధుసూదన్‌రెడ్డి**



**మణుగూరు, మహా** : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు సోమవారం మణుగూరులో సీపీఐ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఎంసీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై జెండాలు చేతబట్టి ఆందోళన చేపట్టడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. అధికారుల జోక్యంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చే విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణమాఫీ, పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువుల ధరల పెరుగుదలతో రైతులపై భారం పడుతోందని, మధ్యవర్తుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచి రోజుకు రూ.700 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను విరమించుకోవాలని కోరారు. డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, వై.రాంగోపాల్, గొందే కుటుంబరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు దండుగుల బాబు, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, కొడిమెల సుజాత, కొత్తపల్లి సీతారాములు, కన్నెబోయిన ప్రసాద్, నాగరాజు, యాకూబ్, కణతాల కోటయ్య, లింగస్వామి, భీమరాజు కృష్ణ, బత్తుల లక్ష్మయ్య, లక్ష్మి, రంజిత్, ఆంజనేయులు, టీయూసీఐ నాయకులు సంజీవరెడ్డి, యాకయ్య, రాజేందర్, బత్తుల వెంకటేశ్వర్లు, కె సుధాకర్, తిరుపతి, ఎంసీపీఐ నాయకుడు ఎం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాను నిరసిస్తూ సిపిఐ ప్రచార జాత

**ఆలేరు ఆగస్టు 10 మహా:** బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుండి సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జాత ప్రారంభమైంది ఆలేరు,కొలనుపాక మీదుగా రాజపేట యాదగిరిగుట్ట మండలాలలో ప్రచార జాత ఈరోజు కొనసాగుతుంది ప్రచార జాతలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం తేవాలని, పెరుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టాలని, మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని కార్మిక హక్కులను పరిరక్షించాలని , బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇమ్రాన్, చెక్క వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 12వ వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలి

- **మణుగూరు జీఎం కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ధర్నా**
- **జీఎం దుర్గం రామచందర్‌కు కార్మికుల వినతి..**

**మణుగూరు, మహా** : బొగ్గుగని కార్మికులకు 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ 11వ వేతన ఒప్పందం గడువు ముగిసిందని, జూలై 1 నుంచి కొత్త వేతన ఒప్పందం అమల్లోకి రావాల్సి ఉందన్నారు. కోల్ ఇండియా యాజమాన్యం జాతీయ కార్మిక సంఘాలతో చర్చించి 12వ వేతన ఒప్పందాన్ని ఖరారు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కొత్త లేబర్ కోడ్‌లను సాకుగా చూపుతూ వేతన ఒప్పందం ఏర్పాటులో జాప్యం చేయడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కోల్ ఇండియా, సింగరేణి వ్యాప్తంగా ఏరియా జీఎం కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం వెంటనే 12వ వేతన కమిటీని ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకుడు వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, సీఐటీయూ బ్రాంచ్ నాయకుడు వెంకటరత్నం, హెచ్ఎంఎస్ నాయకురాలు కోడిపెల్లి శ్రీలత, టీయూసీఐ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, వివిధ సంఘాల బ్రాంచ్ నాయకులు, ఫిట్ కార్యదర్శులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.




## ఆలేరులో సిఐటియు జైల్ భరో

**ఆలేరు ఆగస్టు 10 మహా:** కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపుమేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో సిఐటియు పిలుపుమేరకు సోమవారం నాడు సిపిఎం అనుబంధ సంఘాలు రాస్తారోకో నిర్వహించి అరెస్టయినారు. బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్ వరకు కార్మికులు, రైతులు, హమాలీలు ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా పోలీసులు ఆందోళన కారులను అరెస ఈ సందర్భంగా జిల్లా డిసిసిబి మాజీ డైరెక్టర్ మొరిగాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకం పేరు మార్చడానికి తీవ్రంగా దుయ్యబట్టారు ఈ జైలు భరో కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు మొరిగాడి రమేష్, నాయకులు బింగి రాజు, పిక్క గణేష్, అన్నపూర్ణ, చింతకింది వాణి,మొరిగాడి వందన, ధనలక్ష్మి,ఆలేరు రాజు,ఐలయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కట్టుమల్లారంలో కొత్త పంచాయతీ భవనం ప్రారంభం

- **రూ.20 లక్షలతో కార్యాలయ నిర్మాణం..**
- **గ్రామాల అభివృద్ధికే ప్రాధాన్యం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**మణుగూరు, మహా :** గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం కట్టుమల్లారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ నూతన కార్యాలయం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. గ్రామ పరిపాలన సజావుగా సాగడంతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందన్నారు. కట్టుమల్లారం అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

**ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయనిధి అండ..**

అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక, మణుగూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.5.20 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.

**బాలకృష్ణ వైద్యానికి రూ.5 లక్షల సాయం..**

మణుగూరు మండలం రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన పొట్టూరి బాలకృష్ణ వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.5 లక్షల విలువైన అనుమతి పత్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం అందజేశారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలకృష్ణ కుటుంబ సభ్యులకు పత్రాన్ని అందించారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పాయం తెలిపారు. అర్హులైన వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా తనవంతు కృషి కొనసాగిస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వపరంగా సాధ్యమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి..**

మణుగూరు 100 పడకల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం. రామకృష్ణ సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రామకృష్ణకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. సూపర్ రింగ్టెండెంట్ తో పాటు డాక్టర్ బి. విశ్వ నిఖిల్, డాక్టర్ మోహన్ వంశీలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.




## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట..

- **మణుగూరులో భారీ ర్యాలీ**
- **అంబేడ్కర్ సెంటర్‌లో రాస్తారోకో**
- **అడ్డుకున్న పోలీసులు**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అన్నవరపు కనకయ్య ఆగ్రహం**

**మణుగూరు, మహా** : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య విమర్శించారు. సోమవారం మణుగూరులో చేపట్టిన జైల్ భరో కార్యక్రమం సందర్భంగా స్థానిక శ్రామిక భవన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుని రాస్తారోకో చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపించారు. లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సులభతర వ్యాపారం పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికులను ఇష్టానుసారంగా తొలగించే 'హైర్ అండ్ ఫైర్' విధానానికి స్వస్తి పలకాలని, మహిళా కార్మికుల రక్షణ, హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిట్టల నాగమణి, తోట పద్మ, శ్యామల, రమణ, లక్ష్మి, హమాలీ నాయకులు సత్యనారాయణ, ఆర్.శ్రీను, రమేష్, గ్రామపంచాయతీ నాయకులు సదానందం, రమేష్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు శైలజ, విజయ, సుజాత, సతీష్, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల అనుసంధానం కోసం ఎమ్మెల్యేకు వినతి

- **ప్రణాళిక పనులను ఎమ్మెల్యేకు వివరించిన కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు**

**కారేపల్లి,మహా:** రైతుల పంట సాగునీటి అవసరాల కోసం చెరువుల అనుసంధానం చేపట్టాలని చీమలవారి గూడెం కట్టు నుంచి గేట్ కారేపల్లి చెరువుకు సాగునీరు అందేలా ప్రణాళికలను రూపొందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపూడి తిరుమలరావు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను కోరారు.చీమలవారి గూడెం కట్టు నుంచి అనంతారం,గేట్ కారేపల్లి చెరువులకు సాగునీరు అందేలా చేపట్టాల్సిన నీటి ప్రణాళికను కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు వివరించారు.ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా,చెరువులకు నీరు అందించి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం కల్పించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం రైతుల సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని గుడిపూడి తిరుమలరావు స్పష్టం చేశారు.



## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం

**క్యాతనపల్లి మహా :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించడమే కమ్యూనిస్టుల ధ్యేయమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, మండల కార్యదర్శి వనం సత్యనారాయణ అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర ఐదో రోజు సోమవారం బిజోన్ సెంటర్ నుంచి ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోందని సిపిఐ నాయకులు ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, నక్క వెంకటస్వామి, కామెర దుర్గరాజ్, మామిడి గోపి, కౌన్సిలర్ కౌడగాని సాంబయ్యలు పాల్గొన్నారు.

## మాజీ సెక్యూరిటీ గార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత..

- **రూ.8,300 అందజేసిన సహచరులు**

**మణుగూరు, మహా :** కష్టకాలంలో సహచరుడి కుటుంబానికి అండగా నిలిచి సింగరేణి మణుగూరు ఏరియా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు మానవత్వాన్ని చాటుకున్నారు. విశ్వాస్ సెక్యూరిటీ ఫోర్స్‌లో గతంలో పనిచేసిన ఎం.అరుణ్‌కుమార్ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంత సోమవారం ఆయన కుటుంబానికి సహచర సెక్యూరిటీ గార్డులు రూ.8,300 ఆర్థిక సహాయం అందజేశారు. తమతో కలిసి పనిచేసిన అరుణ్‌కుమార్ కుటుంబం కష్ట సమయంలో ఉండటంతో తోడుగా నిలవాలనే ఉద్దేశంతో సిబ్బంది స్వచ్ఛందంగా సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వాస్ సెక్యూరిటీ సిబ్బంది డి సుధాకర్, రబ్బాని, రామ్ అవతార్, పి సుధీర్, వి శ్రీనివాస్, ఎం రాజనర్సు, ఏ ప్రవీణ్, ఖాసీం, రాజేష్, మోతిలాల్, సంపత్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# దళితుల సంక్షేమం కోసం కృషి

- **జాతీయ రాష్ట్ర నేతల దృష్టి**
- **పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు**

ఆదిలాబాద్ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దిశానిర్దేశం



**ఆదిలాబాద్ మహా :** దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఎస్సీ విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో జాతీయ కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ శ్రీ సిద్ధార్థ హితంబ్రే, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్ ఇతర పార్టీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు.పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ప్రదర్శనలో కొమురం భీం, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో ఆయన నేతలతో కలిసి పార్టీ బలోపేతం, నాయకుల సమస్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ విభాగం మరింత బలోపేతమై, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎస్సీ విభాగాన్ని మరింత పటిష్టం చేసి, దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ విభాగానికి సూచించారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమానత్వం, దళితుల హక్కుల కోసం ప్రతి కార్యకర్త చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని బీఆర్ఎస్ చెప్పి విస్మరించిందని ఆయన విమర్శించారు. కాని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో దామోదరం సంజీవయ్యను అప్పట్లోనే ముఖ్యమంత్రి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం ఎస్సీ సెల్ నేతలు మరింత చురుగ్గా పని చేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో దేశవ్యాప్తంగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం దళిత విభాగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జాతీయ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఎస్సీ విభాగాన్ని పునర్నిర్మించి మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. దళితుల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.దళితులందరూ ఐక్యంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే బీజేపీకి గెలిచే అవకాశమే ఉండదని అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు దళితులను కాంగ్రెస్ పార్టీ వైపు చైతన్యపరిచే విధంగా గ్రామస్థాయి నుంచి విస్తృతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో దళిత కుటుంబాలను కలుసుకుని కాంగ్రెస్ పార్టీ విధానాలను, సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న కృషిని వివరించాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో దళితుల జనాభా 20 శాతానికి పైగా ఉందని, రాబోయే ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా ఎస్సీ విభాగం నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి, పార్టీ విజయానికి దళిత ఓటర్లను సమీకరించడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు దళితులు, మైనారిటీలు, గిరిజనులు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ విలువలకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని తెలిపారు కాంగ్రెస్ పార్టీలో పనిచేయని బ్రాక్‌ను పక్కకు పెట్టేసి.. పనిచేసే నేతలను ప్రాధాన్యత ఇవ్వడమే పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పార్టీ పదవులు పొందిన వారు క్షేత్రస్థాయిలో వెళ్లి అందరిని సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కష్టపడ్డ కార్యకర్తకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు.భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పరిపాలన పాలించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు.మహాత్మా గాంధీ ఆశయాలు, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, సామాజిక సమానత్వం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్ళు, సంక్షేమ పథకాలను అందిస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో కూడా దళితులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు.అనంతరం నూతనంగా నియమించబడ్డ జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభాగం కమిటీకి ,మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ,బోథ్ , ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జీలు ఆడే గజేందర్ ,శ్యామ్ నాయక్ ,నాయకులు సాజిద్ ఖాన్ సంజీవ రెడ్డి ,సమతా సుదర్శన్ ,ఏంఏసీ చైర్మన్లు మల్లెపూల సత్య నారాయణ , కుంరం సత్యవతి కోటేష్ , అశోక్ రెడ్డి ,ఆత్మ చైర్మన్లు గిమ్మ సంతోష్ రావు, కౌడాలా నారాయణ నాయకులు షాహిద్ అలీ ,అంబకంటి అశోక్ , సెడ్మకి ఆనంద్ రావు, గిమ్మ దీపక్, చంద్రయ్య , బ్రీజులాల్ , బొల్లారం బాబన్న , మల్యాల కరుణాకర్ , అక్తర్ అలీ గారు, దేవిదాస్ చారి ,పసుల చంటి ,మేకల జితేందర్ ,ఎస్సీ విభాగం జిల్లా మండల కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిటి నాయుడు సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- **ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**
- **బాబు క్యాంపులో పిటి నాయుడు సంతాప సభ**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కార్మిక సంఘం నేత దివంగత పిటి నాయుడు సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. సోమవారంపిటి నాయుడు సంతాప సభను బాబు క్యాంపులో నిర్వహించారు. ముందుగా పిటి నాయుడు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివకుమార్ పిటి నాయుడు సేవలను కొనియాడారు. ఈ ఆత్మీయ సంతాప సమావేశంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెబి శౌరి, ఐ ఎన్ టి యు సి సింగరేణి ఏరియా సెక్రెటరీ రజాక్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, బోడికల రాజేశ్వరరావు, కళాకారులు కళా పోషకులు కూరపాటి రామశేషం రాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల వీరయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి పాల్, సీనియర్ జిల్లా పార్టీ నాయకులు మహమ్మద్ ఆరిఫ్ ఖాన్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు సుధాకర్, సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, సకినాల సమ్మయ్య, సుమన్, పెయింటర్ ప్రకాష్, సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఏ రజాక్, సీనియర్ సిపిఐ నాయకులు మాతంగి లింగయ్య, దళిత సంఘాల జిల్లా నాయకులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, కూర రవీందర్, గుడివాడ రాము, బ్రదర్ బీరమోహనరావు, దుర్గ రాసి సమ్మయ్య, భూపతి అశోక్, మచ్చ పృథ్వీరాజ్, కనుకుంట్ల బాబన్న, కండక్టర్ ప్రసాద్, మెకానిక్ వెంకట్, రాము, రాజేశ్వరరావు, సాయి కుమార్, శ్యామ్, సి ఎస్ ఐ చర్చి పాస్టర్లు రెవరెండ్ కిరణ్ కుమార్, పాస్టర్ పృథ్వీరాజ్, కమిటీ సభ్యులు, స్త్రీల కూటమి సభ్యులు, దేవుని బిడ్డలు, కుటుంబ సభ్యులు, పిటి నాయుడు సతీమణి, కూతుర్లు అల్లుళ్లు మనుమలు మనవరాళ్ళు తదితరులు ఉన్నారు.

# అంబసత్రం సాగుదారులను గోసపెట్టొద్దు

- పంట రుణాలు భరోసా రాక అంబసత్రం రైతుల అవస్థలు
- పోడు అంబసత్రం సాగుదారుల పట్టాల కోసమే మా పోరాటం
- మండల రైతాంగానికి సీతారామ జలాలందించాలి
- కార్పొరేట్ కొమ్ముకాసే బీజేపీ వైఖరి మారేవరకు పోరాడతాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా
- లక్ష్మీదేవిపల్లి మండలంలో సిపిఐ జనచైతన్య యాత్రకు అపూర్వ స్పందన



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** దశాబ్దాలుగా భూములను నమ్ముకుని సాగు చేసుకుంటున్న అంబసత్రం భూముల పేద రైతులకు హక్కు పత్రాలు ఇవ్వకుండా పాలకులు గోసపెట్టడం తగదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కౌన్సిల్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజైన సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో సాగింది. సీతారాంపురం, లాలూ తండా, కోరుకొండ, హేమచంద్రాపురం తదితర గ్రామాల మీదుగా సాగిన యాత్రకు ప్రజలు, రైతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సెంటర్లలో జరిగిన బహిరంగ సభల్లో యాత్ర రథసారథి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ మండల పరిధిలోని 264 సర్వే నంబర్లోని ఐదు వేల ఎకరాల అంబసత్రం భూములను గిరిజన, గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. రికార్డుల్లో అనుభవదారులుగా ఉన్నప్పటికీ ఆ భూములపై చట్టబద్ధమైన హక్కులు లేవనే సాకుతో ప్రభుత్వం రైతు భరోసా నిలిపివేసిందని, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు పెట్టుబడులు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతూ తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునేందుకు అనుమతులు ఎందుకు నిరాకరిస్తున్నారో ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే సాగుదారులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని, నిర్మితమవుతున్న సీతారామ ఎత్తిపోతల జలాలను లక్ష్మీదేవిపల్లి మండల రైతాంగానికి సాగునీరుగా పారించి భూములను సస్యశ్యామలం చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజాకంటక విధానాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యుడిపై భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, కార్మిక చట్టాలను రద్దు చేసి శ్రమజీవుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల మధ్య మత విద్వేషాల చిచ్చుపెడుతున్న కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే బీజేపీ వైఖరి మారేవరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. టేకులపల్లిలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి.వీరస్వామి, వాసిరెడ్డి మురళి, ఫహీం, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, జర్పుల ఉపేందర్, రత్నకుమారి, సర్పంచులు ఉపసర్పంచులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



# కారేపల్లిలో కధం తొక్కిన కార్మికులు

**నేతల అరెస్టుల తో ఉద్రిక్తత**
**కారేపల్లిలో జైల్ భరో విజయవంతం**

**కారేపల్లి, మహా :** కేంద్రప్రభుత్వ కార్మిక, కర్షక రైతు విధానాలపై నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జైలు భరో కార్యక్రమం కారేపల్లిలో విజయవంతమైంది. సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు కారేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో, మానహారం చేపట్టారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. కారేపల్లి ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో పోలీసులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనంలో స్టేషన్ కు తరలిస్తుండగా కార్మికులు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. వ్యకాస నేతను స్టేషన్ కు తరలించిన అనంతర మిగితానాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. పోలీస్ స్టేషన్ సైతం కార్మిక సంఘంనేతలునిరసన కార్యక్రమాన్ని సాగించారు. ఈసందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర లు మాట్లాడతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేదలు, కార్మికులు, రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పేదలకు పని కల్పించే ఉపాధి హామీ గ్యారెంటీ చట్టాన్ని కొనసాగించాలని ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించే రేషన్ షాపులను నిర్వీర్యం చేసి.నిరుపేదలకు 35 కేజీలబియ్యం అందజేసే ఏఏవై కార్డులకు బియ్యం కుదించిందన్నారు ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లతో కార్మికుల శ్రమను దోచుకోవటానికి కార్పొరేట్ సంస్థలకు హక్కు కల్పించారన్నారను. ఇక 12 గంటల పనివిధానం రానుందన్నారు పని భారం తగ్గించి కనీస వేతన చట్టం అమలు చేయాలని.వ్యవసాయ చట్టాలు, విద్యుత్ చట్టాలను తీసుకవస్తుందని దీంతో వ్యవసాయ రంగంలో చిన్న సన్నకారు రైతులపరిస్థితి ప్రశ్నార్ధకంగా మారనుందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల నిరసన జైల్ భరోతో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, పాసిని నాగేశ్వరరావు, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు సురభాక ధనమ్మ, కొండబోయిన ఉమావతి, సీఐటీయు ముక్క సీతారాములు, అజ్మీర శోభన్, సోమందుల నాగమణి, ఎల్లబోయిన రాధ, గుగ్రం వెంకటేశ్వర్లు, కేలోత్ రవి, శనగ రాంబాబు, ఆదెర్ల వినయ్, రేగళ్ల మంగయ్య, కరపటి సీతారాములు, కొండల్‌రావు, ఇస్మాయిల్, కళ్యాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థిపై దారుణ దాడి

- **కర్రలతో కొట్టి.. బూట్లతో ముఖంపై తొక్కి**
- **ర్యాగింగ్ పేరుతో సీనియర్ల దాడి అంటున్న విద్యార్థి**
- **అసలు విషయాన్ని దాచి పెట్టిన పాఠశాల యాజమాన్యం**



**కుషాయిగూడ, మహా :** దమ్మాయిగూడలోని శ్రీచైతన్య హైస్కూల్ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు దారుణంగా దాడి చేసిన ఘటన కలకలం రేపింది. కామారెడ్డికి చెందిన అభిషేక్‌పై రాత్రి సమయంలో సుమారు 12 మంది విద్యార్థులు కర్రలు, ప్లేట్లతో దాడి చేసి, బూట్లతో ముఖంపై తొక్కినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. బాలుడు మెట్లపై నుంచి కిందపడిపోయాడంటూ స్కూల్ యాజమాన్యం తమకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిందని, వెంటనే పాఠశాలకు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చామని తల్లిదండ్రులు తెలిపారు. అయితే తనపై ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారని అభిషేక్ చెప్పడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వారు తెలిపారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యార్థులపై, అలాగే ఘటనను బయటకు రాకుండా దాచిపెట్టేందుకు ప్రయత్నించిన స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అభిషేక్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.




# కార్పొరేట్ల సేవలో తరిస్తున్న మోదీ ప్రభుత్వం

**కార్మిక రైతుసంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కార్మిక రైతు వ్యవసాయ కార్మిక హక్కులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తుందని, కార్పొరేట్ల సేవలో తరిస్తూ ప్రజల హక్కుల్ని హరిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి,ఏఐకేఎంఎస్ నాయకులు సురేందర్ ఊక్లా,సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విశ్వం శెట్టి పూర్ణచంద్రరావు, జలీల్, ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జాటోత్ కృష్ణ అన్నారు. ఈ జైలు భరో కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, నాయకులు నారాటి ప్రసాద్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి సీతారామయ్య, నాయకులు గోపాలరావు, ఐఎన్టీయూసీ నాయకులు నాగభూషణం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడులను రద్దు చేయాలని పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న బొగ్గు బ్లాక్లులు అటవీ సంపద రైలు రోడ్లు ఇలా మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని ఇది దేశ ఆర్థిక వ్యవస్థకే తీవ్ర ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని బిబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని కార్మికులకు కనీస వేతనం 26000 అమలు చేయాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడండి లేదంటే మోడీ ప్రభుత్వం గద్దె నుండి దిగిపోండి అంటూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. మోడీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచారని ధరలను పెంచి ప్రజల జేబుకు చిల్లు పెట్టారని విమర్శించారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు రైతు వ్యవసాయ కార్మికుల హక్కులను నిరాకరిస్తున్న మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరిపై క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తి తోటి భవిష్యత్తులోనూ మరిన్ని పోరాటాలను కొనసాగిస్తామని నేతలు హెచ్చరించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్లో వందలాది మంది రైతులు కార్మికులు వ్యవసాయ కార్మికులు రహదారిపై బైఠాయించడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులను ప్రజలను అరెస్టు చేసి త్రీటౌన్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఎస్ కే యం నాయకులు అమర్లపూడి రాము మధు సిఐటియు నాయకులు లిక్కి బాలరాజు రమేష్ దొడ్డ రవి సత్య ఏ ఐ కె ఎస్ నాయకులు కొండబోయి వెంకటేశ్వర్లు కోబల్ కున్సోత్ ధర్మ వీర్ల రమేష్ తిరుపతిరావు వెంకట్రావు తులసి రామ్ ఏఐటీయూసీ నాయకులు జమలయ్య ఎస్ కే యం నాయకులు బుర్ర వెంకన్న కల్తీ వెంకటేశ్వర్లు కుమార్ సంజీవ్ ప్రసాద్ ఆదిలక్ష్మి మంగమ్మ ఉమా జ్యోతి లక్ష్మి ఇందిరా పద్మ రజిత తదితరులు పాల్గొన్నారు.



## తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని మారుతి కాలనీ, చక్రిపురం ప్రాంతంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. మహిళలు, యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొని వారితో కలిసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి పండుగలను ప్రతి ఒక్కరూ ఐక్యత, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.తీజ్ పండుగ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో నేమూరి మహేష్ గౌడ్, మహేందర్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, సుధాకర్, శ్రీను, వెంకటేష్, శ్రీకాంత్, రవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## గుప్త నిధుల పేరుతో అమాయక ప్రజలను మోసం

- **నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన, శంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్**
- **రాజేంద్రనగర్ పోలీసులు**

**రాజేంద్రనగర్ మహా ;** గుప్త నిధుల పేరుతో అమాయకులను నమ్మించి కోటి రూపాయలు వసూలు చేస్తున్న ముఠాను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు మహ్మద్ మునావర్ తన స్నేహితులతో కలిసి పథకంలో సయ్యద్ అలీ అష్రఫ్,(40) మహ్మద్ హాజీ,(25) మహ్మద్ సల్మాన్‌ల (29 )ను అరెస్ట్ చేశారు.ముఠా సభ్యులు ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయని అమాయక ప్రజలను నమ్మించి, వారు సూచించిన ప్రదేశాల్లో గుంతలు తీయించి, ముందుగానే సిద్ధం చేసుకున్న బొగ్గు, నకిలీ బంగారు నాణేల సంచులను అందులో పెట్టేవారు. అనంతరం పూజలు నిర్వహించి, బొగ్గు బంగారంగా మారడానికి సమయం పడుతుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయేవారు. ఇలా వివిధ ప్రాంతాల్లో సుమారు 11 మందిని మోసం చేసి లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, 25 నకిలీ బంగారపు నాణేలు, ఆరు కిలోల బొగ్గు, నాలుగు కిలోల మట్టి, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గతంలో బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుప్త నిధుల పేరుతో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి..గుప్త నిధుల తీస్తామని ఎవరైనా మోసం చేసేందుకు ప్రయత్నిస్తే నమ్మవద్దు, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## బోనాల వేడుకల్లో మేడ్చల్ బీజేపీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి

**ఘట్కేసర్ ( మహా )10 ఆగస్టు** : మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సోమవారం పోచారం డివిజన్ పరిధిలోని వెంకటాపురం గ్రామం, పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీలో జరిగిన బోనాల వేడుకల్లో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఉత్సవ కమిటీలు నిర్వహించిన అలంకరించిన బోనాల బండి ఊరేగింపులో పాల్గొని భక్తులతో కలిసి సందడి చేశారు. డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాల మధ్య ఆ ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిరుడు రామారావు ముదిరాజ్, మేడిపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు బండారు పవన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, యాదగిరి ముదిరాజ్, జశ్వంత్‌గౌడ్, అశోక్‌గౌడ్, నిరుడు వినోద్ ముదిరాజ్, ప్రశాంత్, శివ, బాలకృష్ణ, ధనుష్ ముదిరాజ్, కాలనీ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో

- **ఇబ్రహీంపట్నం చౌరస్తాలో రాస్తారోకో**
- **సాగర్ రహదారిపై బైఠాయించిన సిపిఎం నాయకులు**
- **ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలింపు**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 10 మహా:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ లు, మతోన్మాదం నుండి భారతదేశాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జైల్ భరోకు పిలుపునిచ్చారు. సోమవారం ఇబ్రహీంపట్నం చౌరస్తా సాగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి రోడ్డుపై బైఠాయించడంతో, సిపిఎం నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించిన సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్, పెట్టుబడుదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా భారతదేశాన్ని కాపాడుకోవాలన్నారు. బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద, సంస్కరణనలను వేగవంతంగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే లేబర్ కోడ్ ల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోటిఫై చేసింది. 2025విద్యుత్ సవరణల బిల్లు, విత్తన చట్టానికి ప్రతిపాదించారు. సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడిదారుల గరిష్ట లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేశారు. రోజువారి పని దినాన్ని 8గంటల నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సమ్మె హక్కును కాలరాస్తూ ఆంక్షలు విధించారు. కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ ను కష్టతరం చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ గాలికి వదిలేశారు. కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే పరిస్థితి లేదు. లేబర్ కోడ్స్ అమలు అయితే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతారు. వెంటనే 4 లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏటా 18 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ కు వస్తుండగా కనీస మద్దతు ధర అమలు జరగకపోవడం వల్ల రైతులు ఏటా 4లక్షల కోట్లు నష్టపోతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలతోపాటు పంట రుణాల సౌకర్యం, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బీమా సౌకర్యం కల్పించాలి. కనీసం మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మారుస్తూ విబిజి రామ్ జి గా తీసుకు వచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు 35 కేజీల బియ్యాన్ని రద్దుచేసి ఒక్కొక్క మనిషికి 7 కేజీలు మాత్రమే ఇవ్వాలని ఆహార భద్రత చట్టంలో తీసుకు వచ్చిన సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 2025 విద్యుత్ సవరణ బిల్లు వెంటనే రద్దు చేయాలి ఈ చట్ట ప్రకారం విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి పోవడంతో తెలంగాణలో వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్తును సరఫరా గ్యారెంటీ ఉండదన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ప్రజలందరు నయా ఉదారవాద, సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సామెల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్ర కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కిషన్, స్వప్న, ఎల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంచందర్, జిల్లా ఉపాధ్యక్షులు ముసిలయ్య, బుగ్గరాములు, రావుల జంగయ్య, తావు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, కందుకూరి జగన్, జిల్లా ఉపాధ్యక్షులు చాతళ్ల జంగయ్య, సైదమ్మ, కుమార్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శారద, గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరంగ్, శ్రీకాంత్, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు గజ్జల మహేష్, కంబాలపల్లి మహేష్ పాల్గొన్నారు.



## రోడ్డు పక్కన గుర్తుతెలియని శవం

**వరంగల్, క్రైమ్ మహా ;**తేదీ 9 8 2026న రాత్రి 21:30 గంటలకు వరంగల్ నగరం కొత్తవాడ లోని రుద్రాక్షిణి బార్ సమీపంలో రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని మగ వ్యక్తి శవం పడి ఉన్నది. దీనిపై 10 08 2026 తేదీ ఉదయం 8 30 గంటలకు మట్వాడ పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు దారుడు టి కళ్యాణ్ కుమార్ (పిసి 2468) కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు పేర్కొన్న ప్రకారం, 9 8 2026 సుమారు 20:00 గంటలకు, తాను బిసి1 పెట్రోలింగ్ డ్యూటీలో ఉండగా, రాత్రి సుమారు 21:30 గంటలకు, వరంగల్ జిల్లా, కొత్తవాడ రుద్రాక్షిణి బార్ సమీపంలో అనారోగ్యంతో ఒక గుర్తుతెలియని బిచ్చగాడు మరణించి పడి ఉన్నట్లుగా 9542492641 మొబైల్ నంబర్ నుండి డయల్ 100 ద్వారా ఒక కాల్ వచ్చింది. ఆ సమాచారం అందుకున్న వెంటనే, అతను సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా, సుమారు 60 సంవత్సరాల వయస్సు గల ఒక గుర్తుతెలియని వృద్ధ బిచ్చగాడు చనిపోయి పడి ఉన్నాడు. పరిశీలనలో, అతను అనారోగ్యంతో మరణించినట్లుగా కనిపించింది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి, ఈ విషయాన్ని అతని పై అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా అతను చట్టపరమైన చర్యల కోసం పై సమాచారాన్ని సమర్పించడం జరిగింది.

## పగటి చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



**ఘట్‌కేసర్ మహా 10 ఆగస్టు :**పగటిపూట ఎవరూ లేని సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, ఉప్పల్ జోన్ సీసీఎస్ బృందం సంయుక్తంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 73 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాముల వెండి సామాను, ఒక యూనికార్న్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, రూ.3 వేల నగదును సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ షాహుల్ వయసు 29, కుంచాల గురుప్రసాద్ వయసు 29 రోజు పూట ఇళ్లు ఖాళీగా ఉంటాయని గమనించి ఇనుప రాడ్లతో తాళాలు బద్దలు కొట్టి లోపలికి చొరబడి నగదు, బంగారం దోచుకునేవారు. ఈ నెల 2వ తేదీన గాంధీనగర్‌లో ఒక కుటుంబం ఉదయం బయటకు వెళ్లగా మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటి గేటు, ప్రధాన తలుపు తాళాలు విరిగి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన నెక్లెస్, నల్లపూసల గొలుసు, చెవి రింగులు, వంకీలు, ఉంగరం కలిపి 90 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు మాయమైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పట్టుబడిన వారిలో షాహుల్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో దోపిడీలు, గృహ చోరీలు, వాహన చోరీలు, ఎన్‌డీపీఎస్ కేసులు కలుపుకొని మొత్తం 47 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గురుప్రసాద్‌పై జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఆస్తి సంబంధిత కేసు ఉంది. మార్కాపూర్, సింగరాయకొండ, వాడపల్లి, పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మరికొన్ని కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఘట్‌కేసర్ యంనంపేట వద్ద రూటీన్ వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నేరాన్ని ఒప్పుకున్నారు. ఉప్పల్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్ ఐపీఎస్ పర్యవేక్షణలో, మేడిపల్లి ఏసీపీ బి. మోహన్ ఆధ్వర్యంలో ఈ ముఠాను ఛేదించారు. ఇంటిని ఖాళీగా వదిలి వెళ్లేముందు తలుపులు, కిటికీలు గట్టిగా మూసి ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని, విలువైన నగలు, ఎక్కువ నగదు ఇంట్లో పెట్టుకోవద్దని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు కాల్ చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- **12 వ వేజ్ బోర్డు కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి**
- **మందమర్రి జిఎం కార్యాలయం ముందు జాతీయ కార్మిక సంఘాల ధర్నా**



**మందమర్రి, మహా :** నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడులను రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మందమర్రి జిఎం కార్యాలయం ముందర జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన ధర్నాకు ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి, హెచ్ ఎం ఎస్, సిఐటియు ల నేతలు సలేంద్ర సత్యనారాయణ, ఎండి అక్బర్ అలీ, కాంపల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, సాంబార్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, శ్రీనివాస్, పార్వతి రాజిరెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసేందుకు బాజాపా నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం దాదాపూర్ 56 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడలుగా కుదించిందని ఇది చాలా దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుకూలంగా సింగరేణి కార్మికులకు వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, కొత్త గనులు ఏర్పాటుచేసి నిరుద్యోగ నిర్మూలనకు పాటుపడాలని వారు కోరారు. ర్యాలీగా వెళ్లిన ఆందోళనకారులు జిఎం కార్యాలయం ముందర బయట నుంచి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పానుగంటి వెంకటస్వామి, దార బిక్షపతి, కుక్కల ఓదెలు, డి రమేష్, దాగం మల్లేష్, ఎగ్గిడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలను చైతన్యం చేయడానికే సిపిఐ పార్టీ కృషి

**సిపిఐ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ & రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి**

**బెల్లంపల్లి ,మహా :** ప్రజలను చైతన్యం చేయడానికి సిపిఐ పార్టీ పాదయాత్ర ద్వారా కృషి చేస్తుందని సిపిఐ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ తోపాటు రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామిలు ప్రకటించారు . సోమవారం నాడు పాదయాత్రలో భాగంగా బెల్లంపల్లి మండలంలోని అంకుశం గ్రామపంచాయతీలో అంకుశం లింగదరి గూడ గోండు గోడ గ కన్నాల గ్రామపంచాయతీ లో కన్నాల ఎస్సీ కాలనీ లక్ష్మీపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ జాతకు బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ మరియు రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ బొల్లం పూర్ణిమ హాజరై ఆగస్టు 6 నుండి 14 వరకు నియోజకవర్గంలో 5వ రోజులో పలు గ్రామాలు తిరుగుతూ ప్రజలను చైతన్యం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్రంలోని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన విధానాలను కొనసాగిస్తుందని సంబంధిత విధానాలను నిరసిస్తూ త్వరితగతిన ప్రజా సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు .ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పార్టీ ద్వారా జాగృతం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బి కే ఎం యు జాతీయ కౌన్సిల్ మెంబర్ అక్కపల్లి బాబు ,జిల్లాకు సమితి సభ్యులు మేకల రాజేశం, రత్నం రాజం, రత్నం ఐలయ్య, దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్,అంబేద్కర్,రమణ తదితరులు పాల్గొన్నారు




'మోదీ బిల్డర్' మోసం...

## హామీలిచ్చి వంచించారంటూ 'ఓనర్స్ అసోసియేషన్' ధర్నా

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లిలోని సిల్వర్ ఓక్ విల్లాస్ నిర్మించిన 'మోదీ బిల్డర్' కొనుగోలుదారులను దారుణంగా మోసం చేశారంటూ సిల్వర్ ఓక్ విల్లాస్ ఓనర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బిల్డర్ వైఖరిని నిరసిస్తూ సోమవారం కాలనీవాసులు, విల్లా యజమానులు విల్లాస్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. బిల్డర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**60 విల్లాలు అని చెప్పి 200 విల్లాలు**

ప్రారంభంలో కేవలం 60 విల్లాలు మాత్రమే ఉంటాయని చెప్పి, ఆ తర్వాత ఫేస్1, ఫేస్2, ఫేస్3 పేర్లతో ఏకంగా 200 విల్లాలు నిర్మించారు. కానీ సదుపాయాలు మాత్రం కేవలం 60 విల్లాలకు తగినట్లే ఉంచి అందరినీ మభ్యపెడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం 60 శాతం స్థలాన్ని కాలనీ సదుపాయాలకు కేటాయించాల్సి ఉండగా, కేవలం 40 శాతం స్థలాన్ని మాత్రమే వదిలి అక్రమాలకు పాల్పడ్డారు. ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటుకు అడ్డుపడుతూ, సొసైటీకి రావాల్సిన రూ. 60 లక్షల కార్పస్ ఫండ్‌ను ఎగ్గొట్టేందుకు బిల్డర్ పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో తమను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వాటర్ హార్వెస్టింగ్ గుంతలను డ్రైనేజీ , సెప్టిక్ ట్యాంకులుగా ఉపయోగిస్తూ పారిశుధ్యాన్ని దారుణంగా దిగజార్చారనీ, స్లడ్జ్‌ను రోడ్లపైకి విడుదల చేస్తుండటంతో విల్లా నం. 16 ప్రాంతం మురుగుకూపంగా మారిందన్నారు. గ్రీనరీ లాన్‌గా చూపించిన స్థలంలో స్విమ్మింగ్ పూల్ కట్టేశారని, క్లబ్ హౌస్, పార్కులను సరిగా అభివృద్ధి చేయలేదని తెలిపారు. ఫేజ్ 3 స్లాబ్‌లు నాసిరకంగా నిర్మించడంతో తరచూ విరిగిపడుతున్నాయని, వర్షం వస్తే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని వాపోయారు.ఫేజ్ 3లో మంచీరు, మున్సిపల్ నీటి కనెక్షన్ కోసం ఒక్కో విల్లా యజమాని నుండి రూ. 12,500 వసూలు చేసి ఇప్పటికీ నీటి సరఫరా పునరుద్ధరించలేదు. ఆర్వో నీటి సౌకర్యం, సీసీటీవీ నిఘా, వీధి దీపాలు, సెక్యూరిటీ టాయిలెట్లు, పార్కింగ్ వసతులు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన సదుపాయాలు అడిగితే బిల్డర్ బెదిరింపులకు దిగుతున్నాడని, నాసిరకం భవనాలను అంటగట్టి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ అక్రమాలపై ఇప్పటికే జిహెచ్ఎంసి , రెరా , హెచ్ఎండీఏ అధికారులతో పాటు రాష్ట్ర మంత్రులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

## డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలి

- **వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు : చైర్మన్ గోడిసేల సంధ్యారాణి–రాజారమేష్**

**క్యాతనపల్లి మహా :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ చౌక్‌లో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ గోడిసేల సంధ్యారాణి -రాజారమేష్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల కారణంగా అక్కడ జీవనాధారం కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చైర్మన్ దృష్టికి వచ్చిందని, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ప్రజలకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందన్నారు.

**పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**

డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఏఈ అశృత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినాష్‌ను చైర్మన్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.



మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో ప్రజలకు ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో తనను సంప్రదించవచ్చని చైర్మన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామిడి ఉమాదేవి, బీఆర్ఎస్ నాయకులు రామిడి కుమార్, లక్కిరెడ్డి, లక్ష్మీకాంత్, సదయ్య, అప్పాల రవి లు పాల్గొన్నారు.



# తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- మహా వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- సీఎంతో కలసి పూజల్లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే

**కారేపల్లి, మహా:** వర్షాలు కురిసి జలాశయాలు సమృద్ధిగా నిండి పాడి పంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. నాగార్జునసాగర్ లో తెలంగాణ ప్రభుత్వం సోమవారం నిర్వహించిన మహా వరుణ యాగంలో వైరా ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. నాగార్జున సాగర్ లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి పుష్పగుచ్చం అందజేసి సీఎంతో కలిసి వరుణ యాగం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుతూ చేపట్టిన పథకాలన్నీ అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా అనేక కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. వరుణ దేవుడు కూడా కరుణించి తెలంగాణ అభివృద్ధికి ఆశీస్సులు ఇవ్వాలని దానిలో భాగంగానే మహాయాగంలో ముఖ్యమంత్రి దంపతులు పాల్గొని పూజలు చేశారని చెప్పారు. తాను కూడా యాగంలో పాల్గొని రైతన్న లను అన్ని విధాల ఆదుకునేలా వరుణ దేవుడు నిండుగా ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నానని తెలిపారు. వైరా నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించే దిశగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



# సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

- పరామర్శించిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి

బెల్లంపల్లి, మహా: బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి మండలం భూదాఖుర్ద్ గ్రామపంచాయితీ సీనియర్ నాయకులు ముత్తె మురళి తండ్రి కీ:శే: ముత్తె వెంకటి గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో స్వర్గస్తులైన సందర్భంగా వారి నివాసానికి వెళ్లి సోమవారం నాడు ఎల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకు రామ చందర్ తో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వర్ కన్వీనర్ స్వామి, పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జరిగిందని భవిష్యత్తులను పార్టీ సంబంధిత కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గం రాజం, మాజీ మండల అధ్యక్షులు సింగతి సత్యనారాయణ , సర్పంచుల ఫోరం అధ్యక్షులు వంగ రామగౌడ్ , అధికార ప్రతినిధి బత్తుల రవి , సీనియర్ నాయకులు ఎంబడి సురేష్ , బొలిశెట్టి సుధాకర్ , బుగ్గ దేవాలయ డైరెక్టర్ మీసా రమేష్ , సల్లా సంతోష్ , తదితర నాయకులు పాల్గొన్నారు.

# పిజిఎస్ఏఐ జిల్లా అధ్యక్షుడిగా బిల్లా శ్రీకాంత్

**వరంగల్, మహా :** ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా (పిజిఎస్ఏఐ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వరంగల్ నగరంలోని 37వ డివిజన్ ఖిలా వరంగల్ తూర్పు కోటకు చెందిన సీనియర్ నాయకులు బిల్లా శ్రీకాంత్ నియామకమైనట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుముల్ల యమునా రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిల్లా శ్రీకాంత్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో పిజిఎస్ఏఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందని, శక్తివంచన లేకుండా వరంగల్ జిల్లాలో ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రియాంకా గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుముల్ల యమునా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందెల్లి ప్రకాష్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పోలీస్ వెంకన్న, పిజిఎస్ఏఐ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మేదరబోయిన రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు




# కారేపల్లిలో సీపీఐ ప్రజాచైతన్య యాత్ర

- సంక్షోభంలో పేదల బతుకులు
- ప్రజా చైతన్య యాత్రలో సీపీఐ నేత దండి సురేష్

**కారేపల్లి, మహా:** కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తూ సీపీఐ చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర సోమవారం కారేపల్లిలో చేరుకుంది. సీపీఐ కార్యకర్తలకు చైతన్య యాత్రకు ఘనస్వాగతం ఫలికారు. ఈసందర్భంగా కారేపల్లి బస్టాండ్ సెంటర్ లోజరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో పేదల బతుకులు సంక్షేభంలో పడ్డాయన్నారు. మోడీ 12 ఏండ్ల పాలనలో తాను ఇచ్చిన ఏ వాగ్ధానం అమలు కు నోచుకోలేదన్నారు. మోడీ తన విధానాలతో రైతాంగం ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచక పోగా వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేశారన్నారు. రసానిక ఎరువులు, పురుగు మందులు ధరలను ఐదేండ్లలో రెట్టింపు చేశారన్నారు. రూ. లక్షల కోట్లు అప్పులను కార్పొరేట్ అధిపతులకు రద్దు చేసిన మోడీ సర్కార్, రైతంగానికి చెందిన నయా పైసా అప్పును రద్దు చేయలేదన్నారు. నిత్యం రామ నామం జపించే మోడీ, రాముడి నిధులను కాజేసిన వారిపై చర్యలకు ఎందుకు వెనకాడుతుందన్నారు. వందలాది హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్, ఉచిత బస్సు, సన్నబియ్యం తప్ప ఏ హామీలను నెరవేర్చలేదన్నారు. రుణమాఫీలో ఘోరంగా విఫలమైందని, 50శాతం కూడా రుణమాఫీ జరగలేదని విమర్శించారు. పాలకుల విధానాలను ప్రజలకువివరించి చైతన్యం చేయటం పోరాటలకు మద్దతు కూడగట్టటం చైతన్య యాత్ర ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రబాబు, ఏపూరి లతా, జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర్ రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, యంగళ అనందరావు, శ్రావణ్, తాటి నిర్మల, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, తాతా వెంకటేశ్వర్లు, వీరు నాయక్, ఉంగరాల సుధాకర్ రావు, చెన్నం శెట్టి భూసయ్య, దల్ సింగ్, పుచ్చకాయల శ్రీను, బట్టు సంగయ్య, బొమ్మల కృష్ణ, రాయల రామారావు, జానీ, తదితరులుపాల్గొన్నారు.

# క్యాతనపల్లిలో ద్విపాలన'పై చర్చ!

- చైర్పర్సన్ వర్గం ఒక వైపు.. అధికార పార్టీ మరో వైపు
- అభివృద్ధి కంటే రాజకీయ ఆధిపత్య పోరే ప్రధానాంశంగా మారిందా?

**క్యాతనపల్లి మహా :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో పాలన వ్యవహారాలు ప్రస్తుతం రాజకీయ విభేదాల నడుమ సాగుతున్నాయనే చర్చ పట్టణంలో జోరుగా వినిపిస్తోంది. మున్సిపల్ చైర్మన్ వర్గం ఒక వైపు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వర్గం మరో వైపు ఉండడంతో పట్టణంలో ద్విపాలన పరిస్థితులు నెలకొన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా పాలన వ్యవస్థ ఒక్కటే అయినప్పటికీ, రాజకీయంగా మాత్రం రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**అభివృద్ధి పనులపై ప్రభావం?**

మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం, అధికారులపై సమన్వయం తదితర అంశాల్లో వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన సమన్వయం కొంత మేరకు దెబ్బతింటుందనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది.



డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎవరికి వారే.. తమదే పైచేయి అన్నట్లుగా**

చైర్ పర్సన్ వర్గం మున్సిపల్ పాలనలో తమదే కీలక పాత్ర అని పేర్కొంటుండగా, కాంగ్రెస్ వర్గం మాత్రం ప్రజల సమస్యలు, అభివృద్ధి పనుల విషయంలో తమకూ సమాన ప్రాధాన్యత ఉండాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు ముదురుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులపై ఒత్తిళ్ల ఆరోపణలు**

ఇరు వర్గాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాల ప్రభావం మున్సిపల్ అధికార యంత్రాంగంపై పడుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. తమ వర్గానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని ఇరువర్గాలు ఒత్తిడి తెస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

**ప్రజా ప్రయోజనాలే ముఖ్యం**

రాజకీయ విభేదాలు ఏవైనా.. వాటి ప్రభావం మున్సిపల్ పాలనపై పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు. వర్గపోరుకు స్వస్తి పలికి, పట్టణ అభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. 'ఎవరి ఆధిపత్యం' కంటే 'ప్రజలకు ఏం మేలు జరుగుతోంది' అన్నదే పాలనకు కొలమానంగా ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఈ రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులను వేగవంతం చెయాలి

- కేంద్ర మంత్రికి అధికారిక లేఖను అందజేసిన టీజీ బీజేపీ బృందం



**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు కు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఆమోదం తెలిపినందుకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్ నాయక్, బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ తో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా వన్నాల వెంకటరమణ లతో కూడిన తెలంగాణ బీజేపీ నాయకుల బృందం న్యూఢిల్లీ జోర్బాగ్ సాఫదారగంజ్ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి ఒక అధికారిక లేఖను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధ అభినందనీయ మని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ తాను మహబూబాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో వరంగల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ఈ రోజు ఆ కల నెర వేరుతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని లేఖలో అజ్మీరా పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కేంద్ర మంత్రితో జరిగిన భేటీని గుర్తుచేసుకుంటూ రామ్మోహన్ నాయుడి నిరాడంబరత, అందుబాటులో ఉండే స్వభావం చురుకైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ నగర పర్యటనకు విచ్చేయాల్సిందిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను బీజేపీ బృందం ఆహ్వానించింది. మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన లేదా అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రాక తెలంగాణ ప్రాంత అభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా అదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి వెంటనే శ్రీకారం చుట్టాలని అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను కోరారు. అలాగే మామునూరు విమానాశ్రయంలో భూములు కోల్పోయిన కుటుంబాల తో పాటు సమీప గ్రామ ప్రాంతం లోని ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్దన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ కేంద్ర మంత్రి ని కోరారు. వీరి విజ్ఞప్తులను కేంద్రం పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని బీజేపీ బృందం శాలువాలతో సత్కరించింది.

# వరంగల్ నగరానికి కొత్త సొబగులు

- కాకతీయ మ్యూజికల్ గార్డెన్ లో సరికొత్త వెలుగులు
- రూ.6.20 కోట్లతో కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ
- ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**వరంగల్, కార్పొరేషన్ మహా;** వరంగల్ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా రూ.6.20 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటెన్, ప్రత్యేక లేజర్ షోను మంత్రి వీక్షించారు. కాకతీయుల చరిత్ర, పరిపాలనా వైభవం, కళలు, సంస్కృతి, శిల్పకళను వెలుగు, సంగీతం, దృశ్యాల సమ్మేళనంతో కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంది. చరిత్ర పుస్తకాల్లో చదివే కాకతీయుల ఘనతను సజీవ దృశ్యాల రూపంలో సందర్శకులకు పరిచయం చేసేలా లేజర్ షోను రూపొందించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాకతీయుల ఘన చరిత్రకు ప్రతీకగా నిలిచిన వరంగల్ నగరంలో పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ నగర ప్రజలకు సేదతీరే ఆహ్లాదకర ప్రదేశంగా, సందర్శకులకు చారిత్రక అనుభూతిని కలిగించే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుందని తెలిపారు. పునరుద్ధరణలో భాగంగా గార్డెన్ సుందరీకరణ, పచ్చదనం, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచినట్లు మంత్రి వివరించారు. కాకతీయుల కళా వైభవం, నిర్మాణ నైపుణ్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేసేలా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వరంగల్ చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రపంచానికి చాటడంతో పాటు పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా నగరంలోని పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. చరిత్రను కాపాడుతూ ఆధునిక సదుపాయాలను జోడించడం ద్వారా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ ఐటీఐని 'హబ్'గా అప్ గ్రేడ్ చేయాలి

- పీఎం-సేతు కింద హాస్టల్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినతి

**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం సేతు పథకం కింద 'స్పోక్' నుంచి 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. 1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం సుమారు 1,402 మంది శిక్షణ పొందుతున్నారని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున సంస్థను ఆధునిక సౌకర్యాలతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎస్‌సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట-వరంగల్ రైల్వేతో పాటు ఇతర పారిశ్రామిక రంగాల విస్తరణతో భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని కడియం కావ్య వివరించారు.

# కిసాన్‌నగర్ ఘర్షణ ఘటన.. ఏడుగురు అరెస్ట్

- 29వ డివిజన్ కార్పొరేటర్ సహా ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**కరీంనగర్, మహా :** కరీంనగర్ III టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో జరిగిన ఘర్షణ ఘటనపై పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ కూడా ఉన్నారు. ఈ మేరకు డీసీపీ వెంకటరమణ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కిసాన్‌నగర్‌లోని వేపచెట్ల గ్రౌండ్ వద్ద ఆగస్టు 9న రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కరీంనగర్ III టౌన్ పోలీస్ స్టేషన్‌లో FIR నంబర్ 274/2026 నమోదు చేశారు. BNS సెక్షన్లు 191(2), 191(3), 109(1) ర/w 190తో పాటు SC/ST (Prevention of Atrocities) Amendment Act2015లోని సెక్షన్లు 3(1)(r)(s), 3(2)(va), 3(2)(v) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కిసాన్‌నగర్‌కు చెందిన 40 ఏళ్ల 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్, బొమ్మకల్‌కు చెందిన 31 ఏళ్ల కుడిది నాగేందర్ అలియాస్ నాగేంద్ర బాబు, కిసాన్‌నగర్‌కు చెందిన 29 ఏళ్ల పంతంగి మధు అలియాస్ మధుకర్, 32 ఏళ్ల నెరెళ్ల నాగరాజు అలియాస్ రాజు, 30 ఏళ్ల శ్రీరామోజు భానుచందర్ అలియాస్ భాను, 19 ఏళ్ల సంగం వేణు అలియాస్ చరణ్, 28 ఏళ్ల పంతంగి శశిధర్ అలియాస్ చింటూలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి దర్యాప్తు కొనసాగించారు. అనంతరం నిందితులను చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వెంకటరమణ తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ స్పష్టం చేశారు.

# రైతును రాజును చేయడమే లక్ష్యం

- భూ భారతి ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రైతు సంక్షేమానికి నెలకు రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి



**హనుమకొండ, మహా:** రైతును రాజుగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం రైతు సంక్షేమానికి రెట్టింపు నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గతంలో నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం రూ.5,250 కోట్లు వివిధ పథకాల ద్వారా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, గోదాముల సామర్థ్యాన్ని ప్రభుత్వం దాదాపు రెట్టింపు చేసిందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ రికార్డుల ప్రక్షాళన చేపడుతున్నామని, భూ భారతి ద్వారా భూముల హక్కులు, టైటిల్, రికార్డులు, మ్యాప్ వివరాలను స్పష్టంగా అందించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు తమ భూముల వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి కోరారు. ప్రజల సహకారంతో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ప్రయోజనం ఇచ్చే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలని కోరారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రైతు మేళాల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతపై రైతులకు అవగాహన కలుగుతుందని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలను సద్వినియోగం చేసుకుని ఉత్పాదకత, ఆదాయం పెంచుకోవాలని సూచించారు. రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యానవన శాఖల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

# తేజస్వి మదివాడ అందాల సందడి.. స్టైలిష్ లుక్‌లో మెస్మరైజ్

తెలుగు సినీ నటి తేజస్వి మదివాడ తన ప్రత్యేకమైన నటనతో పాటు స్టైలిష్ లుక్స్‌తోనూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. తాజాగా ఆమె చేసిన ఫొటోషూట్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పసుపు రంగు లేయర్డ్ గౌన్‌లో తేజస్వి ఎంతో అందంగా కనిపిస్తూ ఆకట్టుకున్నారు. గౌన్‌కు ఉన్న సున్నితమైన కట్ అవుట్స్, పూల అలంకరణ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి.విడిచిన జుట్టుతో, సహజమైన చిరునవ్వుతో తేజస్వి ఇచ్చిన పోజులు ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సింపుల్‌గా కనిపిస్తూనే గ్లామర్ టచ్‌తో ఈ లుక్‌ను ఆమె ఎంతో కాన్ఫిడెంట్‌గా క్యారీ చేశారు. వేసవి వాతావరణానికి సరిపోయే ఈ లుక్‌లో తేజస్వి యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

**సినీ ప్రయాణం ఇలా..**

తెలుగు చిత్ర పరిశ్రమలో తేజస్వి మదివాడ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ఐస్‌క్రీమ్, కేరింత వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు.

బిగ్‌బాస్ తెలుగు కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత తేజస్వికి మరింత గుర్తింపు వచ్చింది. అక్కడ తన చురుకుదనం, స్పష్టమైన అభిప్రాయాలు, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత కూడా సినిమాల్లో విభిన్న పాత్రలు చేస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.విభిన్న కథల్లో నటన.. తేజస్వి నటించిన హైడ్ అండ్ సీక్ చిత్రం క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కింది. విశ్వంత్ దుద్దుంపూడితో కలిసి నటించిన ఈ సినిమాలో ఉత్కంఠభరితమైన కథ, మలుపులతో కూడిన కథనం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది.అలాగే కమిట్‌మెంట్ చిత్రంలోనూ తేజస్వి విభిన్నమైన పాత్రలో కనిపించారు. ప్రేమ, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన ఈ సినిమాలో ఆమె నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రను పోషించారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకోవడం ద్వారా నటిగా తన పరిధిని విస్తరించుకుంటున్నారు.తాజా ఫొటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో సందడి చేసిన తేజస్వి.. తన అందం, ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు.



# ప్రమోషన్ల విషయంలో నయనతార కొత్త పంథా



లేడీ సూపర్‌స్టార్‌గా దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నయనతార తన కెరీర్‌లో మరో కీలక మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయిక ప్రాధాన్యత ఉన్న చిత్రాలతోనూ విజయాలు అందుకున్న ఆమెకు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది.సాధారణంగా సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత ప్రచార కార్యక్రమాలు, ఇంటర్వ్యూలకు నయనతార దూరంగా ఉండేవారు. సినిమా కంటెంట్‌పై నమ్మకంతోనే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించవచ్చనే విధానాన్ని ఆమె చాలాకాలంగా అనుసరించారు. అయితే ప్రస్తుతం మారుతున్న సినీ మార్కెట్, ప్రచార విధానాలకు అనుగుణంగా ఆమె తన పంథాను మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి నయనతార ప్రత్యేక ప్రచార వీడియోల ద్వారా తనవంతు సహకారం అందించారు. నేరుగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా ఆమె చేసిన వీడియోలు సినిమాపై ఆసక్తిని పెంచడంలో ఉపయోగపడ్డాయి. ఇక తాజాగా యష్ కథానాయకుడిగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న టాక్సిక్ చిత్రానికి సంబంధించిన ప్రత్యక్ష కార్యక్రమంలో నయనతార పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. గతంలో ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉండే ఆమె ఇలా బహిరంగంగా కనిపించడం అభిమానులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం సినిమాకు కేవలం మంచి కథ, భారీ తారాగణం ఉంటే సరిపోవడం లేదు. ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేందుకు సమర్థవంతమైన ప్రచారం కూడా కీలకంగా మారింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో తారల ప్రచార కార్యక్రమాలు సినిమాకు మరింత చేరువ కల్పిస్తున్నాయి. సినిమా నిర్మాణంలో నటీనటుల పాత్రతో పాటు విడుదలకు ముందు దాన్ని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడమూ ముఖ్యమేనని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నయనతార కూడా ఇకపై తన సినిమాల ప్రచారంలో మరింత చురుగ్గా పాల్గొనే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. సుదీర్ఘకాలంగా తనకంటూ ప్రత్యేకమైన పంథాను కొనసాగించిన నయనతార ఇప్పుడు ప్రచార విషయంలో తీసుకుంటున్న ఈ కొత్త నిర్ణయం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. రాబోయే చిత్రాల విషయంలోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.



# దీ ఒడిస్సీతో నోలన్ బాక్సాఫీస్ సంచలనం

హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన 'ది ఒడిస్సీ' ప్రపంచ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 1.1 బిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించి, నోలన్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు అందుకున్న చిత్రంగా నిలిచింది. ఈ క్రమంలో గతంలో 'ది డార్క్ నైట్ రైజెస్' పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. చైనా, జపాన్ వంటి కీలక మార్కెట్లలో విడుదల కాకముందే ఈ స్థాయి వసూళ్లు సాధించడం విశేషంగా మారింది.ఐమాక్స్ వసూళ్లలోనూ ఈ చిత్రం సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు జేమ్స్ కామెరూన్ 'అవతార్' పేరిట ఉన్న ఐమాక్స్ కలెక్షన్ల రికార్డును 'ది ఒడిస్సీ' అధిగమించింది. 'అవతార్' ఐమాక్స్ వెర్షన్ ద్వారా 271 మిలియన్ డాలర్లు వసూలు చేయగా, 'ది ఒడిస్సీ' ఇప్పటికే 289 మిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో ఐమాక్స్ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా కొత్త రికార్డు నెలకొల్పింది.ఈ విజయానికి నోలన్ అనుసరించిన ప్రత్యేక చిత్రీకరణ విధానం ప్రధాన కారణంగా నిలిచింది. పూర్తిస్థాయిలో ఐమాక్స్ కెమెరాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు భారీ విజువల్ అనుభూతిని అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సినిమా అభిమానుల నుంచి వస్తున్న స్పందనతో ఐమాక్స్ ప్రదర్శనలకు భారీ డిమాండ్ ఏర్పడింది.అమెరికా మార్కెట్‌లోనే ఐమాక్స్ వెర్షన్ ద్వారా ఈ చిత్రం 147.3 మిలియన్ డాలర్లు రాబట్టగా, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మరో 141.8 మిలియన్ డాలర్లు సాధించింది. పలు దేశాల్లో ఐమాక్స్ స్క్రీన్లపై ఈ చిత్రానికి మంచి ఆదరణ కొనసాగుతోంది. ముందస్తు టికెట్ బుకింగ్స్ కూడా సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తున్నాయి.

ఇక చైనా, జపాన్ మార్కెట్లలో విడుదల తర్వాత 'ది ఒడిస్సీ' వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా చైనాలో భారీ సంఖ్యలో ఐమాక్స్ స్క్రీన్లలో విడుదల కానుండటంతో ప్రపంచ బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అనిరుధ్ వర్సెస్ తమన్.. క్వాలిటీపై మరోసారి చర్చ

ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న సంగీత దర్శకుల్లో అనిరుధ్ రవిచందర్ ముందువరుసలో ఉన్నారు. ఇతర సంగీత దర్శకులు సినిమాల సంఖ్యలో ముందున్నప్పటికీ, పాటలు, నేపథ్య సంగీతం విషయంలో అనిరుధ్ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆయన సంగీతం సినిమాకు అదనపు బలంగా మారుతుందనే అభిప్రాయం ప్రేక్షకుల్లో బలంగా ఉంది.అనిరుధ్‌కు పోటీగా నిలిచే సంగీత దర్శకుల్లో తమన్ కూడా ముఖ్యమైన పేరు. గతంలో పలు సందర్భాల్లో తమన్ తన సంగీతంతో అనిరుధ్‌కు గట్టి పోటీ ఇచ్చారు. ముఖ్యంగా 'ఓజీ' చిత్రానికి అందించిన పాటలు, నేపథ్య సంగీతానికి మంచి స్పందన లభించింది. దీంతో అనిరుధ్, తమన్ మధ్య సంగీతపరమైన పోటీపై అభిమానుల్లో చర్చ సాగింది.అయితే తాజాగా తమన్ సంగీతం విషయంలో కొన్ని విమర్శలు ఎదుర్కొంటున్నారు. 'కొరియన్ కనకరాజు' చిత్రంలోని పాటలు, నేపథ్య సంగీతంపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కొన్ని సన్నివేశాల్లో గత చిత్రాల సంగీతాన్ని పోలిన బీజీఎం వినిపించిందంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది. ఒకేసారి ఎక్కువ సినిమాలకు పనిచేయడం వల్ల ప్రతి చిత్రానికీ సమానమైన సమయం కేటాయించడం సాధ్యం కావడం లేదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఇదే సమయంలో అనిరుధ్ 'డీసీ' అనే మధ్యస్థాయి చిత్రానికి అందించిన సంగీతం ప్రశంసలు అందుకుంటోంది. కథ సాధారణంగానే ఉన్నప్పటికీ, కొన్ని సన్నివేశాలకు ఆయన అందించిన నేపథ్య సంగీతం మరింత ప్రభావాన్ని తీసుకొచ్చిందని ప్రేక్షకులు చెబుతున్నారు. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాలను బలంగా నిలబెట్టడంలో సంగీతం కీలకంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.సినిమా స్థాయి, బడ్జెట్‌తో సంబంధం లేకుండా సంగీతానికి ప్రాధాన్యత ఇవ్వడమే అనిరుధ్ ప్రత్యేకత అని అభిమానులు అంటున్నారు. క్వాంటిటీ కంటే క్వాలిటీకి ప్రాధాన్యత ఇవ్వాలంటూ కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే అనిరుధ్‌తో పోలుస్తూ తమన్‌పై సోషల్ మీడియాలో ట్రోల్స్ కూడా కనిపిస్తున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com